www.vishalabharati.com
epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
18 జూలై 2023
సంపుటి:1 సంచిక:269

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## కేదార్‌నాథ్ ఆలయంలో ఫొటోలు/వీడియోలపై నిషేధం

2 లో

**బద్రినాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రకటన**






# తెలంగాణలో 24 గంటల కరెంట్ లేదు నేను నిరూపిస్తా..

## కేటీఆర్ ఎక్కడికి రమ్మంటే అక్కడికొస్తా..

## నా సవాల్ కు సిద్ధమా?

## పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సవాల్

**తెలంగాణ బ్యూరో -విశాలభారతి:**

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి.. మంత్రి కేటీఆర్ కు సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ అందడం లేదని.. ఈ విషయం నిరూపించేందుకు తాను ఎక్కడికి రావడానికైనా సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. తెలంగాణలో కరెంటు సరఫరా 24 గంటలు ఉండడం లేదని తాను నిరూపిస్తానని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సవాలు చేశారు. ఈ విషయం నిరూపించడానికి మంత్రి కేటీఆర్ ఎక్కడికి రమ్మంటే అక్కడికి తాను వస్తానని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో త్రీ ఫేస్ కరెంటుపై అధికారులు నియంత్రణ పాటిస్తున్నారని, సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే 24 గంటలు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. గాంధీ భవన్‌లో నేడు (జూలై 17) రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

24 గంటల విద్యుత్ పై చర్చ కోసం సిద్దిపేట, సిరిసిల్ల, చింతమడక, గజ్వేల్, మంత్రి జగదీశ్వర్ రెడ్డి సొంత గ్రామం అయినా సరే ఎక్కడికైనా తాను రావడానికి రెడీగా ఉన్నానని అన్నారు. విద్యుత్ కొనుగోలు పేరుతో పదే పదే ప్రజలను దోచుకుంటున్నారని ఆక్షేపించారు. దొంగ లెక్కలు చూపించి రూ.8 నుంచి రూ.9 వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. దీని మీద విచారణ చేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? అని నిలదీశారు. రాష్ట్రంలో కేవలం 8 నుంచి 12 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా అవుతోందని అన్నారు.

వ్యవసాయానికి ఉచిత కరెంటు అంశాన్ని ప్రజల సెంటిమెంట్‌గా మారుస్తూ స్వార్థం కోసం సీఎం కేసీఆర్ వాడుకోవద్దని తానా సభల్లో తాను చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి వెల్లడించారు. అక్కడ చేసిన వ్యాఖ్యలను తప్పుడుగా ప్రచారం చేసి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆక్షేపించారు. ఉచిత కరెంట్ అనేది పేటెంట్ కాంగ్రెస్ పార్టీది అయితే, అసలు కాంగ్రెస్ పార్టీనే కరెంటు ఇవ్వలేదన్నట్లుగా మాట్లాడడం కరెక్టు కాదని రేవంత్ రెడ్డి అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా అంశంపై ప్రభుత్వాన్ని రైతులు ప్రశ్నించాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు. గత తొమ్మిది ఏళ్ల ప్రభుత్వ పాలనపై రైతులు, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. రాష్ట్రంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం పేరు మీద 30 శాతం కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

### 24 గంటలు ఇవ్వట్లేదని సీఎండీనే చెప్పారు - రేవంత్

"గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ ను, రేవంత్ ను తిట్టకుండా బీఆరెస్ నేతలకు రోజు గడవడం లేదు. థర్మల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కబుర్లు చెప్పారు. 24 గంటల విద్యుత్ సింగిల్ ఫేజ్ అని, త్రీ ఫేస్ 24 గంటలు ఇవ్వడం లేదని సీఎండీ ప్రభాకర్ రావు జనవరి 30న చెప్పారు. ఇవాళ 24గంటల కరెంటుపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే ప్రెస్ మీట్ నుంచి వెళ్లిపోయారు. వ్యవసాయానికి అవసరమైనంత మాత్రమే ఇస్తున్నామన్నారు. నేను అమెరికాలో, హైదరాబాద్ లో ప్రశ్నించింది ఇదే.. 24 గంటల కరెంటు ఇవ్వకుండా ఏటా 16 వేల కోట్లతో కరెంటు కొంటున్నారు. ఏటా రూ.8వేల కోట్లు దోచుకుంటున్నారు.



## ఎన్డీఏలోకి చిరాగ్ పాశ్వాన్

- జేపీ నడ్డా సమక్షంలో చేరిక..
- అనంతరం కీలక ప్రకటన

**ఢిల్లీ విశాలభారతి:** బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి నేతలు రేపు ఢిల్లీలో భేటీ కానున్నారు. ఈ క్రమంలో లోక్ జనశక్తి పార్టీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ మళ్లీ ఎన్డీఏలో చేరారు.బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సోమవారం సమావేశమైన అనంతరం తాను తిరిగి ఎన్డీఏ కూటమిలో చేరుతున్నట్లు ప్రకటించారు. అయితే నేడు, రేపు ప్రతిపక్షాలు బెంగళూరులో కీలక

..మిగతా | 2 | లో



## పాలిటెక్నిక్ స్పాట్ ప్రవేశాలు

-షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్‌విశాల భారతి:** పాలిటెక్నిక్ కోర్సుల స్పాట్ ప్రవేశాలు, అంతర్గత కోర్సు మార్పు కోసం సాంకేతిక విద్యా శాఖ షెడ్యూలు విడుదల చేసింది. సీటు పొందిన అభ్యర్థులు రేపటిలోగా కాలేజీల్లో చేరాల్సి ఉంది. అదే కాలేజీలో మరో కోర్సులోకి మారేందుకు ఈనెల 19, 20వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ వాకాటి కరుణ వెల్లడించారు. ఈనెల 23 వరకు వారికి సీట్లను కేటాయించనున్నట్లు చెప్పారు. ఇంటర్నల్

..మిగతా | 2 | లో

## వందేభారత్ పిటిషన్‌పై సుప్రీం అసహనం

- తర్వాత రాజధాని రైలునూ షెడ్యూల్ చేయమంటారా?

**వెబ్ డెస్క్ విశాల భారతి:** కేరళలోని తిరూర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు స్టాప్ ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఇలాంటి అభ్యర్థనతో అత్యున్నత న్యాయస్థానానికి రావడంపై

..మిగతా | 2 | లో





## ఢిల్లీ చేరుకున్న పవన్ కల్యాణ్

**ఎన్డీఏ మీటింగ్ కోసం హస్తినకు..**

2 లో



## డీఎంకే టార్గెట్‌గా సోదాలు

### ఈడీని ఉసిగొల్పారు.. ఎవరికీ భయపడం

### తమిళనాడు సీఎం స్టాలిన్

**నేషనల్ బ్యూరో- విశాలభారతి:**

ఇప్పటికే తమిళనాడు గవర్నర్ తమ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని, ఇప్పుడు ఈడీ కూడా ఈ ప్రచారంలో చేరిందని, ఇక తమకి ఎన్నికల పని సులువు అవుతుందని వ్యంగ్యాస్త్రాలు విసిరారు తమిళనాడు సీఎం స్టాలిన్. సార్వత్రిక ఎన్నికల వేళ.. తమిళనాడులో డీఎంకేని టార్గెట్ చేసుకుని ఈడీ సోదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు స్టాలిన్. ఇలాంటి బెదిరింపులకు డీఎంకే భయపడదని స్పష్టం చేశారు. తమిళనాడులో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి నివాసంలో ఈడీ తాజాగా దాడులు మొదలు పెట్టింది. 2007 నుంచి 2011 మధ్య గత డీఎంకే ప్రభుత్వంలో పొన్ముడి గనుల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో క్వారీ లైసెన్సు నిబంధనలను ఉల్లంఘించారని, గనుల కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ.. మంత్రి పొన్ముడి, ఆయన కుమారుడు, ఎంపీ గౌతమ్ సిగమణి పొన్ నివాసాల్లో సోదాలు చేపట్టింది. ఇటీవల మనీలాండరింగ్ కేసులో రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసింది, ఇప్పుడు మరో మంత్రి పొన్ముడిని టార్గెట్

..మిగతా | 2 | లో

## పోలీస్ రిక్రూట్‌మెంట్ జీవో 46ను సవరించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్

**ఆదిలాబాద్‌విశాల భారతి:** పోలీస్ రిక్రూట్‌మెంట్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం జారీచేసిన జీవో.నెం.46ను సవరించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు హైదరాబాద్, సైబరాబాద్,రాచకొండ కమిషనరేట్ల పరిధిలోకే 53 శాతం పోస్టులు కేటాయించడం దారుణమని, దీనివల్ల మిగిలిన జిల్లాల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.అన్ని జిల్లాల

..మిగతా | 2 | లో



## పేదరికంలోంచి బయటపడ్డ 13.5 కోట్ల భారతీయులు



**ఐదేళ్ల నివేదిక విడుదల చేసిన నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్**

**నేషనల్ బ్యూరోవిశాల భారతి:** మార్చి నాటికి గడిచిన ఐదేళ్ల కాలంలో 13.5 కోట్ల మంది దేశ ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ వెల్లడించింది. వీరి ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ వృద్ధి గణనీయంగా ఉందని వివరించింది. సోమవారం 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్' (ఎంఐపీ)ను ప్రకటించిన నీతి ఆయోగ్...అందులో ఈ వివరాలను

..మిగతా | 2 | లో



# డబుల్ బిల్లుల వివాదం..

- **సీబీఐ విచారణకైనా సిద్ధమంటూ మంత్రి సవాల్**

**నిజామాబాద్ బ్యూరో విశాల భారతి:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన ఆరోపణలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఖండించారు. తాను ఏ పనికి రెండుసార్లు బిల్లు తీసుకోలేదని స్పష్టం చేశారు. అలాంటి ఆస్కారమే ఉండదని వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద రాష్ట్రానికి రూ.3000 కోట్లు కేటాయిస్తే.. తాను ప్రాతినిథ్యం వహించే రోడ్లు, భవనాల శాఖకు రూ.300 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ డబ్బులతోనే బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. మంత్రిగా తాను పనులు మంజూరు చేస్తే.. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేస్తారని ఆయన వివరించారు. దీనిపై సీబీఐ విచారణకైనా సిద్ధమని మంత్రి ప్రశాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రేవంత్‌రెడ్డి విధానాలతో రైతులకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆరోపించారు. రైతులకు మూడు గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో.. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలని సూచించారు.

# వందేభారత్ పిటిషన్‌పై సుప్రీం అసహనం

మొదటిపేజీ తరువాయి

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇవన్నీ ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయాలని పిటిషనర్‌కు కాస్త గట్టిగానే చెప్పింది. కేరళలోని మలప్పురం జిల్లాలో గల తిరూర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలుకు హాల్ట్ ఇచ్చేలా దక్షిణ రైల్వేకు ఆదేశాలివ్వాలని కోరుతూ రాష్ట్రానికి చెందిన న్యాయవాది పీటీ శీజిష్ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత తిరూర్‌లో వందే భారత్‌ను ఆపాలని నిర్ణయించినప్పటికీ.. ఆ తర్వాత రాజకీయ కారణాలతో రైల్వే శాఖ ఆ నిర్ణయాన్ని మార్చుకుందని ఆరోపించారు. అయితే, ఈ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్‌ను సోమవారం పరిశీలించిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టేందుకు విముఖత వ్యక్తం చేసింది. 'వందేభారత్ రైలు ఏ స్టేషన్‌లో ఆగాలనేది నిర్ణయించాలని మీరు మమ్మల్ని కోరుతున్నారు. ఆ తర్వాత దిల్లీముంబయి రాజధాని స్టాప్ ఎక్కడుండాలో కూడా మమ్మల్ని షెడ్యూల్ చేయమంటారా? ఇలాంటివి మేం ప్రభుత్వానికి చెప్పలేం. ఇది విధానపరమైన అంశం. అధికారుల దగ్గరకు వెళ్లండి' అని పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'రైళ్లు ఎక్కడెక్కడ ఆగాలనేది రైల్వే శాఖ నిర్ణయిస్తుంది. ఫలానా రైలు ఫలానా స్టేషన్ దగ్గర ఆగాలని డిమాండ్ చేసే హక్కు ఎవరికీ లేదు. ముఖ్యంగా వందే భారత్ లాంటి హైస్పీడ్ రైళ్ల స్టాప్‌లను ఇలాంటి డిమాండ్ల ప్రాతిపదికన నిర్ణయించడం సరికాదు. ప్రతి జిల్లాలో నుంచి ఓ వ్యక్తి తమకు నచ్చిన రైల్వే స్టేషన్‌లో స్టాప్ ఉండాలని డిమాండ్ చేయడం ప్రారంభిస్తే.. హైస్పీడ్ రైళ్ల ఏర్పాటుకు ప్రయోజనం లేకుండా పోతుంది. ఎక్స్‌ప్రెస్ రైలు అనే పదానికి అర్థం లేకుండా పోతుంది'' అని కోర్టు తెలిపింది. కనీసం తన పిటిషన్‌ను పరిశీలించేలా ప్రభుత్వానికి సూచించాలని పిటిషనర్ అభ్యర్థించగా.. ధర్మాసనం అందుకు తిరస్కరించింది. తాము ఇందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

# డీఎంకే టార్గెట్‌గా సోదాలు

మొదటిపేజీ తరువాయి

చేసింది. రోజుల వ్యవధిలోనే ఇద్దరు డీఎంకే మంత్రులపై ఈడీ దాడులు తమిళనాడులో రాజకీయ దుమారం రేపాయి. కేంద్రం కుట్రపూరితంగా తమ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందని డీఎంకే మండిపడింది.

కేంద్రానికి వ్యతిరేకంగా విపక్షాలన్నీ బెంగళూరులో సమావేశం పెట్టుకున్న వేళ, ఇలా బెదిరింపులకు దిగడం సరికాదంటున్నారు సీఎం స్టాలిన్. ఇటీవలే పొన్ముడిపై ఉన్న రెండు కేసులను కోర్టు కొట్టేసిందని, ఇప్పుడు ఈడీ సోదాలు చేపట్టిందని, ప్రతిపక్షాల భేటీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారాయన. కాంగ్రెస్ కూడా ఈడీ సోదాలను తీవ్రంగా ఖండించింది. విపక్షాల భేటీకి ముందు తమిళనాడు మంత్రిపై దాడులు జరగడాన్ని బెదిరింపు చర్యగానే భావిస్తున్నామని అన్నారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే. విపక్షాలను విడగొట్టేందుకు మోదీ ప్రభుత్వం రాసిన స్క్రిప్ట్ ఇదని ఆరోపించారు.

# పోలీస్ రిక్రూట్‌మెంట్ జీవో 46ను సవరించాలి


మొదటిపేజీ తరువాయి

అభ్యర్థులకు రిజర్వేషన్ల ప్రకారం సమానంగా న్యాయం జరిగేలా సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్ హౌస్ చుట్టూ అద్దంలాంటి రింగ్ రోడ్ రోడ్డు వేసుకున్నారు కానీ, ఆదివాసీలు నివసిస్తున్న సిర్పూర్,బోథ్ ప్రాంతాల్లో రోడ్లు వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షం పడితే రోడ్లన్నీ గతుకులతో, బురదమయంగా మారుతున్నాయన్నారు. మిషన్ భగీరథ నీళ్లు అందక,తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను కేసీఆర్ తన సొంత నియోజకవర్గంలోనే ఖర్చు పెడుతూ,ఇతర ప్రాంతాల అభివృద్ధిని మాత్రం గాలికి వదిలేశారని విమర్శించారు. సింగరేణి గనులున్న ప్రాంతంలో కోట్ల రూపాయల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నిధులను ముఖ్యమంత్రి ఖాతాలోకి తరలించి గజ్వేల్,బ్లాక్ సిద్దిపేటలో ఖర్చు చేస్తున్నారని అన్నారు.దిందా వాగు వంతెన నిర్మించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.8 ఏళ్ల క్రితమే పనులు ప్రారంభంకావలసి ఉన్న, నేటికీ ప్రారంభించకపోవడం విచారకరమన్నారు.గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువై,అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. బాసర ట్రిబుల్ ఐటీలో 8,000 మంది విద్యార్థులు రోజుల తరబడి సమ్మె చేస్తే గుండె కరగని ముఖ్యమంత్రి కేసీఆర్ కు హిమాన్షు చేసిన పనిని మాత్రం చాలా గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మెరుగైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ రహస్య అజెండాగా మారిందని విమర్శించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా 10 ఏళ్లుగా రైతులను కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతుబంధు ఖాతాలో పడినా తీసుకోలేని దుస్థితిలో రైతులు ఉన్నారని అన్నారు.రైతులు అప్పు ఉన్నారనే నెపంతో బ్యాంకర్లు రైతుల అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నారని అన్నారు.పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజనుడికి పోడు పట్టాలివ్వడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం లబ్ధి పొందడం కోసం కొందరికి పట్టాలు ఇచ్చారని విమర్శించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చింతలమానేపల్లి కేజీబీవీ పాఠశాలను సందర్శిస్తే ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బలంతో అక్కడి స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు.స్పెషల్ ఆఫీసర్ కు ఏమన్నా జరిగితే ఆసిఫాబాద్ కలెక్టరేట్ ను బీఎస్పీ ముట్టడిస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల దందాను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారని కోనేరు కోనప్పపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.గత ఏడాది కూలిన అందవెల్లి బ్రిడ్జిని పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. దిందా వాగు ఉధృతికి జలదిగ్బంధంలో చిక్కుకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆధిపత్య పాలకులు పట్టించుకోవడంలేదన్నారు.బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బహుజన ఆత్మ గౌరవ సభకు హాజరయ్యారు.స్థానిక మహిళలు బోనాలతో స్వాగతం పలికి,పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

# జనసేనపైన కావాలనే ఫోకస్

## రానున్న ఎన్నికల్లో వైసీపీ వర్సెస్ జనసేన


**విశాలభారతి-అమరావతి బ్యూరో:**



తాజా రాజకీయ పరిణామాలు గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. రాబోయే ఎన్నికల్లో తమ ప్రధాన ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ కాదని జనసేన మాత్రమే అని జనాలకు వైసీపీ చెప్పదలచుకున్నదా ? అంటే అవుననే అనుమానాలు పెరిగిపోతున్నాయి. గడచిన 20 రోజులుగా మీడియా అటెన్షన్ ఎక్కువగా జనసేన మీద ఉండటమే దీనికి ఉదాహరణగా చెప్పుకోవాలి. మామూలుగా అయితే వైసీపీకి ప్రధాన ప్రత్యర్థి టీడీపీ మాత్రమే. జనసేన అయినా మిగిలిన పార్టీలైనా టీడీపీ తర్వాత మాత్రమే. కానీ గడచిన 20 రోజులుగా అంటే పవన్ వారాహి యాత్ర మొదలు కాకముందు నుండి మీడియా దృష్టి మొత్తం జనసేన చుట్టూనే తిరుగుతోంది. మీడియా వార్తలు కథనాల్లో ఎక్కువగా పవన్ మాత్రమే ఫోకస్ అవుతున్నారు. మీడియాలో వార్ అంతా మంత్రులుపవన్ మధ్యే అన్నట్లుగా సాగుతోంది. వారాహియాత్రలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా జగన్మోహన్ రెడ్డిపైన నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. దాంతో మంత్రులు అంతేస్థాయిలో రెచ్చిపోయి కంటర్లు ఇస్తున్నారు. దాంతో మీడియా మొత్తం ప్రభుత్వంపవన్ చుట్టే తిరుగుతోంది.ఇక రెండో విడత వారాహి యాత్ర మొదలవ్వటమే పవన్ ఏలూరు సభలో వాలంటీర్ల వ్యవస్థపైన ఆరోపణలు చేశారు. వాలంటీర్లే హ్యూమన్ ట్రాఫికింగుకు కారణమని ఆధారాలు లేకుండానే ఆరోపణలు చేయటంతో గోల మొదలైంది. ఈ గోల ఇలాగుండగానే సచివాలయ వ్యవస్థ ఎందుకు దండగన్నారు. తాను అధికారంలోకి రాగానే వాలంటర్ల వ్యవస్థతో పాటు సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తామని నడుం విరగొడతానంటు నోటికొచ్చింది మాట్లాడేశారు. దాంతో నాలుగు రోజులుగా లెల్లవారి లేచింది మొదలు రాత్రి పడుకునేంతవరకు అటు పవన్ ఆరోపణలు ఇటు మంత్రులు ఎదురుదాడులే కనబడతున్నాయి. ఇదంత చూస్తుంటే మంత్రులు కావాలనే జనసేనపైన ఫోకస్ పెట్టినట్లుగా అనుమానంగా ఉంది. టీడీపీని సైడ్ చేసే ఉద్దేశ్యంతోనే కావాలని పదేపదే పవన్ను టార్గెట్ చేస్తున్నట్లుంది. వాలంటీర్లు సచివాలయ వ్యవస్థలపై పవన్ చేసిన ఆరోపణలను మంత్రులు బాగా అడ్వాంటేజ్ తీసుకున్నట్లే ఉంది చూస్తుంటే. అందుకనే లోకేష్ పాదయాత్రకు కానీ చంద్రబాబునాయుడు కార్యక్రమాలకు కానీ తగినంత స్పేస్ మీడియాలో కనబడటం లేదు.

# కేదార్‌నాథ్ ఆలయంలో ఫొటోలు/వీడియోలపై నిషేధం

**నేషనల్ బ్యూరో-విశాల భారతి:**




ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయంలో ఫొటోలు, వీడియోలు తీసుకోవడాన్ని నిషేధిస్తున్నట్లు బద్రినాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ఆలయంలో ఫొటోలు/వీడియోలు తీసుకోవడంపై నిషేధం విధించినట్లు తెలిపేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 'కేదార్‌నాథ్ ఆలయంలోకి భక్తులు మొబైల్ ఫోన్లు తీసుకురావద్దు. ఆలయం లోపల ఫొటోలు/వీడియోలు తీసుకోవడం పూర్తిగా నిషేధం. ఆలయంలో సీసీటీవీ కెమెరాల నిఘా పర్యవేక్షణ ఉంటుంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'అని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో ఆలయ పరిసరాల్లో కొంతమంది భక్తులు ఫొటోలు/వీడియోలు తీసుకుంటూ అనుచితంగా ప్రవర్తించిన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. దాంతోపాటు ఆలయాన్ని సందర్శించే భక్తులు నిరాడంబరంగా ఉండేలా దుస్తులు ధరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అజయ్ అజేంద్ర సూచించారు. 'ఆలయం పవిత్రతను పరిరక్షించే బాధ్యత కమిటీ సభ్యులతోపాటు, ఆలయాన్ని సందర్శించే భక్తులపై కూడా ఉంది. గతంలో కొంతమంది భక్తులు ఆలయం లోపల ఫొటోలు/వీడియోలు తీసుకుంటూ, ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా ప్రవర్తించారు'అని అజయ్ అజేంద్ర తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఓ మహిళ కేదార్‌నాథ్ ఆలయం గర్భగుడిలో శివలింగంపై కరెన్సీ నోట్లు చల్లుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో సదరు మహిళపై చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ రుద్రప్రయాగ్ కలెక్టర్, ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. అంతకముందు ఆలయ పరిసరాల్లో ఓ యువతి తన బాయ్‌ఫ్రెండ్‌కు ప్రపోజ్ చేసిన వీడియో సైతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనలపై భక్తులతోపాటు, ఆలయ కమిటీ సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఆలయ పరిసరాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ పోలీసులను కోరింది.





# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- **కేంద్రమంత్రి పరుశోత్తం రూపాల**
- **కాంగ్రెస్ వి తాటాకు చప్పుళ్లు,ఇప్పటికీ బీజేపీయే బలంగా ఉంది: సంగప్ప**

**జహీరాబాద్‌విశాల భారతి:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పరుషోత్తం రూపాల బిజెపి నాయకులకు సూచించారు. మెదక్, జహీరాబాద్ లోక్ సభ కోర్ కమిటీ సమావేశంలో పార్టీ నాయకులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికీ బిజెపి మాత్రమే బలంగా ఉందని, కాంగ్రెస్, బీ కేవలం సోషల్ మీడియాలో హడావుడి చేస్తూ ప్రజల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కేవలం బిజెపి మాత్రమే పోరాడిందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రూపాల దిశ నిర్దేశంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో దుబ్బాక శాసనసభ్యుడు రఘునందన్ రావు, పార్టీ కార్యదర్శి జయశ్రీ, లోక్సభ ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి, కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, రవికుమార్ గౌడ్, రజనీకాంత్ తోపాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# పేదరికంలోంచి బయటపడ్డ 13.5 కోట్ల భారతీయులు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించింది. నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ సుమన్ బెరీ ఈ నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం.. 201516లో 24.85 శాతంగా ఉన్న పేదలు.. 20192021 నాటికి 14.96 శాతానికి తగ్గారు. మొత్తంగా ఈ ఐదేళ్లలో 9.89 శాతం మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరిక క్షీణత గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించింది. ఈ ఐదేళ్లలో గ్రామీణ పేదల సంఖ్య 32.59 శాతం నుంచి 19.28 శాతానికి దిగొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 8.65 శాతం నుంచి 5.27 శాతానికి తగ్గింది. ప్రజల విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది నీతి ఆయోగ్. వీటిలో పోషకాహారం, పిల్లలు వారి కౌమారదశ మరణాలు, తల్లి ఆరోగ్యం, పాఠశాల విద్య, పాఠశాల హాజరు, వంట ఇంధనం, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, గృహాలు, ఆస్తులు, బ్యాంకు ఖాతాల వంటి 12 సూచికలు ఉన్నాయి. పారిశుద్ధ్యం, పోషణ, వంట ఇంధనం, తాగునీరు, విద్యుత్, ప్రజలను ఆర్థికంగా మెరుగుపరచడం వంటి వాటిపై.. అంకితభావంతో ప్రభుత్వం పనిచేయడం వల్లే పేదరికం ఈ స్థాయిలో తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. పోషన్ అభియాన్, అనీమియా ముక్త్ భారత్ వంటి పథకాలు పేదలను ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడ్డాయని వివరించింది. స్వచ్ఛ భారత్ మిషన్, జల్ జీవన్ మిషన్ పథకాలు దేశంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచాయని పేర్కొంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా సబ్సిడీతో కూడిన వంట ఇంధనాన్ని అందించడం ద్వారా పేదల జీవితాల్లో సానుకూల మార్పులు వచ్చాయని నీతి ఆయోగ్ తెలిపింది. వీటితో పాటు మిగతా సంక్షేమ పథకాలు దేశ ప్రజలను పేదరికం నుంచి బయటపడేశాయని వెల్లడించింది.

# ఎన్డీఏలోకి చిరాగ్ పాశ్వాన్

మొదటిపేజీ తరువాయి

భేటీ కాగా, మంగళవారం 38 పార్టీలు పాల్గొననున్న కేంద్రంలో అధికారంలో ఉన్న నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ సమావేశానికి ఒక రోజు చిరాగ్ చేరికతో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2020లో బిహార్‌లో రాజకీయాల పరిణామాలతో ఎన్డీఏ కూటమి నుంచి ఎల్ జే పీ వైదొలగింది. ఆ సమయంలో బీజేపీతో పొత్తులో ఉన్న సీఎం నితీష్ కుమార్ పార్టీ జనతాదళ్ (జేడీయూ) కి వ్యతిరేకంగా పాశ్వాన్ కేంద్రంలో అధికార కూటమి ఎన్డీఏ నుంచి వైదొలిగారు.

# ఢిల్లీ చేరుకున్న పవన్ కల్యాణ్

**ఢిల్లీ -విశాలభారతి:**

నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) సమావేశం నిమిత్తం జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం నిర్వహించే ఎన్డీఏ సమావేశంలో పాల్గొంటారు. ఢిల్లీ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీనియర్ కేంద్ర మంత్రులు సైతం తనకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి ఎన్డీఏ సమావేశానికి ఆహ్వానించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిపై చర్చ ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నాను అన్నారు. పవన్ కళ్యాణ్ తోపాటు పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉన్నారు.



# పెరిగే ధరలకు హద్దు లేదు కేంద్ర పాలకులకు బుద్ధి లేదు

- **కూరగాయల ధరలు అదుపు చేయడంలో విఫలం చెందిన పాలకులు**
- **పాలడుగు ప్రభావతి ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్**

**నల్గొండ విశాలభారతి:** ప్రతిరోజు ధరలు పెరుగుతూనే ఉన్నాయి సామాన్య ప్రజలు లబోదిబోమంటూనే ఉన్నారు పెరిగే ధరలకు హద్దే లేదు కేంద్ర పాలకులకు బుద్ధి లేదు అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి విమర్శించారు. ఈరోజు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో కూరగాయలతో నిరసన తెలియజేసి ధరలు నియంత్రించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ టమాటా 140 రూపాయలు కూరగాయలు 80 నుంచి 100 రూపాయల వరకు కేజీ పెరిగిపోయినప్పటికీ ధరలు అదుపు చేయడంలో చిత్తశుద్ధి లేని పాలకులు ప్రజలపై భారాలు మోపుతున్నారని కార్పొరేట్ దోపిడీదారులకు దేశాన్ని దోచిపెడుతున్నారని సిగ్గులేని పాలకుల తీరు ప్రజలు గమనించాలని కోరారు. ఎన్నికల అప్పుడు ఒక మాట ఎన్నికల తర్వాత తన మాట అన్నట్లుగా నేడు పెరుగుతున్న ధరలతో కొనలేని తినలేని పరిస్థితులు దాపురించాయని " ఏముకొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు, ధరలు ఇట్లా పెరగబట్టే నాగులు నాగన్న ధరల మీద మన్ను పొయ్య నాగులో నాగన్న పాలించే పాలకులు నాగులు నాగన్న మన నడ్డి విరగొట్టే నాగులో నాగన్న " అన్న చందంగా తయారయిందని ప్రజలు పాలకులకు బుద్ధి చెప్పడం తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వెలుబుచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, పట్టణ అధ్యక్షురాలు తుమ్మల పద్మ, సాబేర బేగం, నుష్రత్ ఉన్నిస్సా, పుష్పలత, భార్గవి, గీత, కవిత,నర్మద, కవిత,స్వప్న పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ స్పాట్ ప్రవేశాలు

మొదటిపేజీ తరువాయి

స్లైడింగ్ చేసుకున్న విద్యార్థులు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులేనని కమిషనర్ తెలిపారు. అయితే, స్పాట్ ప్రవేశాల ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని వాకాటి కరుణ పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 28లోగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థి వ్యక్తిగతంగా వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేసుకుంటేనే స్పాట్ ప్రవేశాలకు అర్హులని కమిషనర్ స్పష్టం చేశారు.

# బీఆరెస్ టార్గెట్ డైవర్ట్

- నిత్యం జనాల్లో ఉండేలా కేసీఆర్ ప్లాన్... ప్రతిపక్షాలకు ఎదిగేందుకు ఛాన్స్ ఇవ్వని వ్యూహాలు
- పదిరోజుల పాటు రైతు సభలతో కాంగ్రెస్ ఇక ఉక్కిరిబిక్కిరి రైతు డిక్లరేషన్ ఉత్తదేననిపించేలా ఉద్యమాల ప్రణాళికలు..
- రైతుల శ్రేయోభిలాషి పార్టీగా బీఆరెస్సేనని చెప్పేందుకు అన్ని ప్రయత్నాలు
- ఇప్పుడు రాజకీయం రైతుల చుట్టూ..



**నిజామాబాద్ బ్యూరోవిశాలాభారతి:** రాజకీయాలు మారాయి. పొలిటికల్ హీట్‌లో మార్పులొచ్చాయి. బీఆరెస్ ఇప్పుడు తన టార్గెట్‌ను మార్చింది. ఒకప్పుడు బీజేపీ టార్గెట్. దాన్ని ఊపిరితీసుకునే వీలులేకుండా ముప్పేట దాడి చేసిన బీఆరెస్.. ఇప్పుడు బీజేపీని కనీసం పట్టించుకోవడం కూడా మానేసింది. కారణం... బీజేపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోయింది. ఒకప్పుడు మేమే అధికారం అని విర్రవీగిన బీజేపీ... కాలానుగుణంగా వచ్చిన మార్పులు, కొన్ని స్వయంకృతాపరాధాలతో పూర్తిగా వెనుకబడిపోయింది. తన గొయ్యితాను తవ్వుకుంది.

తొలత ఢిల్లీ లిక్కర్ స్కాం పేరుతో కవితను అరెస్టు చేస్తామని చేసిన హడావుడి ఓవరాక్షన్ ఆ పార్టీ కొంపముంచింది. ఇది ఓ వ్యూహాత్మకమని వారంతా భావించారు. కానీ తమ చాప కిందికే నీరొస్తుందని కనీసం ఊహించలేకపోయారు. ఇది చాలదంటూ మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్టు కర్ణాటక ఫలితాలు గట్టి దెబ్బకొట్టాయి. ఆ తర్వాత కాంగ్రెస్ గాలి అంతటా పాకుతూ వచ్చింది. ఏ నలుగురిని కలిసినా ఇదే ముచ్చట. కాంగ్రెస్ పుంజుకుంటున్నదని. ఇలా నోటి ప్రచారం కాస్త మూలుగుతున్న పార్టీకి జీవం పోస్తూ వచ్చింది.

ఒకప్పుడు బీజేపీ టికెట్ల కోసం లైన్ కట్టి కొట్లాడుకున్న నేతలు, కాంగ్రెస్ వైపు చూడటం ప్రారంభించారు. దీంతో కాంగ్రెస్‌కు అభ్యర్థులే దిక్కులేరనే స్థాయి నుంచి మీరైతే పార్టీలో చేరండి.. సర్వేలో ఎవరికి మైలేజీ వస్తుందో చూసి వారికే టికెట్ ఇస్తాం.. అనే రేంజ్‌కు వెళ్లిపోయిందా పార్టీ. ఇదిలా కొనసాగుతున్న తరుణంలో బీఆరెస్.. కాంగ్రెస్ పై ఫోకస్‌పెట్టింది.


దీన్ని నిలువరించేందుకు కత్తులు నూరుతున్న సమయంలో .. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు.. రేవంత్ నోటి దూల బాగా కలిసివచ్చింది బీఆరెస్. మూడు గంటల కరెంటు చాలు.. ఉచిత కరెంటు అనుచితం అంటూ ఏవేవో పనికిమాలిన, అవగాహన రాహిత్యపు మాటలు మాట్లాడిన రేవంత్... ఆ తర్వాత నాలుక్కర్చుకున్నా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. దీన్ని చక్కదిద్దేందుకు ఇంకా ఇంకా తప్పుడు మాటలు మాట్లాడి ప్రజల వద్ద, రైతుల దగ్గర మరింత పలుచనయ్యాడు రేవంత్.

కరెంటు చార్జీలు పెంచొద్దన్నందుకు కాల్పులు జరిపిన ఘటనను కేసీఆర్ ఆపాదించే ప్రయత్నం చేసి మరింత బోల్తా పడ్డాడు రేవంత్. పార్టీని మరింత ఇరకాటంలోకి నెట్టాడు. దీంతో ఇదే మంచి సమయం.. దొరికిన అద్భుత అవకాశంగా తీసుకున్న బీఆరెస్..ఏకంగా పది రోజుల నిరసనకు పిలుపునిచ్చింది. సోమవారం నుంచి రైతులతో నే సమావేశాలు ఏర్పాటు చేయాలని భావించింది. రైతు వేదికలను ఈ సభలకు వినియోగిచుకుంటున్నది. రేవంత్ తాజాగా రైతులనుద్దేశించి రాసిన లేఖ కూడా పెద్దగా పనిచేయలేదనే చెప్పాలి. ఒక్క రుణమాఫీ చేయదు పార్టీ అనే విషయం తప్ప. బీఆరెస్ తమ పార్టీపై చేస్తున్న ముప్పేట దాడిని ఎదుర్కోవడం కాంగ్రెస్ వల్ల అవుతుందా..? ఎన్నికల ముందు చతికిలబడుతుందా..? ప్రజల వద్ద వచ్చిన గాలి నిలుస్తుందా...?? రేవంత్ చేష్టలతో పార్టీ గాలి తీసిన బెలూన్ అవుతుందా..? సమాధానాలు త్వరలోనే దొరకనున్నాయి.



## ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం పై వ్యాసరచన పోటీలు

**జనగామవిశాలభారతి:** తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలనే అంశం పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ గోశాల సమాఖ్య అధ్యక్షుడు రాజేశ్వర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూలై 20 న జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలి అనే అంశం పై వ్యాసరచన పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి తెలంగాణ గోశాల సమాఖ్య ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని అన్నారు. ఎంట్రీ ల సంఖ్యను బట్టి పాల్గొనే విద్యార్థులకు, పాఠశాలలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 9394005600 లో సంప్రదించాలని కోరారు. ఈ ప్రయత్నాల ద్వారా వేలాది మం



## రైతులకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్**

**నిజామాబాద్ బ్యూరోవిశాల భారతి:** కటిక చీకట్ల కాంగ్రెస్ కావాలా? కరెంట్ వెలుగుల బీఆర్ఎస్ కావాలా? తెలంగాణ రైతులు తేల్చుకోవాలని .రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు పిలుపుమేరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పది రోజులపాటు కాంగ్రెస్ పార్టీ పై నిరసనలు వెల్లు వెత్తాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ... 40 ఏళ్ల నుంచి రాజకీయం లో ఉన్న రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచడం జరిగింది. అప్పుడు డిప్యూటీ స్పీకర్ కేసీఆర్ ఉన్నారు అని,ఇది మంచి పద్ధతి కాదని ఆరోజే ఆయన అన్నార అని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి అప్పుడు బుద్ధి చెప్పి రైతులు, కాంగ్రెస్ను అధికారంలోకి తీసుకొచ్చారన విషయం గుర్తు చేశారు. తెలంగాణ రాకున్న ముందు కరెంటు కష్టాలు వర్ణన తీతం అని వివరించారు

రైతులు వ్యవసాయం సాగు చేయాలంటే అనేక ఇబ్బందులు ఉండేవని , బోరు మోటర్ కాలిపోవడం, ట్రాన్స్ఫార్లు కాలిపోవడం, రైతులు పంటలు పండగ బోరు మోటార్ల కు బిల్లు కట్టకుంటే బోరు మోటర్ పీకేల్లడం రైతులపై కేసులు పెట్టడం గత ప్రభుత్వాలు కాంగ్రెస్ ప్రభుత్వం కానీ టిడిపి ప్రభుత్వం గానీ, నాణ్యత కరెంటు ఇచ్చిన దాఖలు లేవు, లో వోల్టేజ్ ఇవ్వడం, రైతులు అప్పట్లో కరెంటు లేక రాత్రింబవళ్లు వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి పాముకాటుకు గాని విద్యుత్ ఘాతానికి గురై ఎందరో రైతులు ప్రాణాలు కోల్పోయారు, కానీ ఇప్పుడు మారింది తెలంగాణ వచ్చిన తర్వాత, వ్యవసాయమే దండగన్న.. ఇప్పుడు వ్యవసాయమే పండగ మార్చింది ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో రైతుల కోసం 24 గంటలు ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా, ఇస్తున్న ప్రభుత్వం ఒక తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఇదే కాకుండా కళ్యాణ లక్ష్మి, ఫెంచన్ , ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర. కానీ కొంతమంది బీజేపీ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలను పక్క తోవ మళ్లించాలని, అబద్ధప్రచాలు చేయడం, మత రాజకీయాలు చేయడం చేస్తున్నారని అన్నారు. ఎందుకంటే ప్రతిపక్ష పార్టీలకు, మాకు ఎక్కడ పుట్టగతులు ఉండవు అని కాంగ్రెస్ భయం, కాంగ్రెస్ ఉనికి చాటుకోవాలని ఇలా రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.రేవంత్ రెడ్డి ఒక దొంగ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణకు అవడం దురదృష్టకరం కరం..కులమతాలో చిచ్చులు పెట్టేందుకే రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని,బిజెపి ప్రభుత్వం మతాల పరంగా మాట్లాడం తప్ప పనిచేయడం తెలియదు మహారాష్ట్రలో బీ ఆర్ఎస్ ప్రభుత్వం రావాలని అక్కడి రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కోరుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, ఎస్టి మైనార్టీలను ఆదుకున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్యమంత్రి ప్రధానమంత్రి అయితే మన రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందుతుందని వివరించారు.మన రాష్ట్రానికి అనేక నిధులు సమకూర్చు కోవచ్చు అని ఆయన అన్నారు. ఇప్పుడు కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో పెన్షన్ 4000 పెంచి మాట్లాడాలి, కానీ ఇప్పుడు అధికారం కోసం 4000 ఇస్తామని చెప్పడం సిగ్గుచేటు, అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ముందు ఇప్పించి తర్వాత మాట్లాడండి అని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్, వివిధ మండలాలకు చెందిన, ఎంపీపీలు, జడ్పిటిసిలు, సొసైటీ చైర్మన్లు సొసైటీ డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ముఖ్యంగా రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## డిమాండ్లను తీర్చాలని రాస్తారోకో

**నడిగూడెంవిశాల భారతి :** గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు.సోమవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెపందు 12వ రోజు వచ్చి చేరుకున్న వారి డిమాండ్ల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసగా ఎంపీడీవో కార్యాలయం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వము మొండి వైఖరి వీడి వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అర్హత కలిగిన ప్రతి కార్మికుని కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా నియమించాలని 19 వేల రూపాయల విత్తనాలు వెంటనే అమలు చేయాలని, 10 లక్షల జీవిత బీమా అమలు చేయాలని, ప్రతి కార్మికునికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని అన్నారు. రాస్తారోకోకు టిడిపి నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు సైదేశ్వర్ రావు మద్దతు తెలియజేశారు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు, నాగరాజు,వెంకన్న, సుభాని, మధుసూదన్, నాగభూషణం,వెంకన్న , వీరస్వామి, వెంకటమ్మ, గురవమ్మ, ఉపేంద్ర, సక్కుబాయి, కమలాకర్,అశోక్, శ్రీకాంత్, నరసింహారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 30 టీఎంసీలకు చేరుకున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

**రివర్స్ పంపింగ్‌లో భాగంగా నడుస్తున్న పంపులు తాత్కాలికంగా నిలిపివేత**

**బాల్కొండవిశాలభారతి:** వర్షాభావం వల్ల నిజామాబాద్ జిల్లా రైతులు వానకాలం పంటసాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసిఆర్ దాన్ని దృష్టిలో పెట్టుకొని రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం జలాలు ఎస్సారెస్పీ లో నింపేందుకు నిర్ణయించి,రోజుకు అర టీఎంసి చొప్పున గత పది రోజులుగా ఎస్సారెస్పీలోకి కాళేశ్వరం జలాలు నింపుకున్నామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు.గత రెండు,మూడు రోజులుగా ఎస్సారెస్పీ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో,ప్రాజెక్ట్ లోకి ఎగువ నుండి వరద నీరు చేరుతుందని మంత్రి తెలిపారు.వానాకాలం సాగు కోసం 40 టిఎంసిలు అవసరమవుతాయనే అంచనాతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా రివర్స్ పంపింగ్ స్టార్ట్ చేయగా,ప్రస్తుత రివర్స్ పంపింగ్ నీటితో,వరద నీటి ద్వారా ఎస్సారెస్పీ నీటి మట్టం 30 టీఎంసీలకు చేరుకున్నదని వెల్లడించారు. దీంతో వర్షాకాల సాగుకు రైతులకు సాగునీటికి డోఖా లేదని అన్నారు.ఈ నేపథ్యంలో రివర్స్ పంపింగ్ లో భాగంగా నడుస్తున్న పంపులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు.కొద్ది రోజుల పాటు వర్షాలు, ఎగువ నీటిని అంచనా వేసి అవసరం ఉంటే మళ్ళీ రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని నింపే ప్రక్రియ పున:ప్రారంభిస్తామని మంత్రి జిల్లా రైతాంగానికి తెలిపారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1070.60 అడుగులకు చేరుకుంది.పూర్తిసాయి సామర్థ్యం 90 టిఎంసిలు కాగా ప్రస్తుతం 30.14 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసన దీక్ష

**టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు**

**సూర్యాపేటవిశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్. సోమయ్య అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ నిరసన దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు గురుకులాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నాలుగు దశల పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని రకాల యాజమాన్యాలలో ఒకే రకమైన పరిపాలన అమలు చేయాలని టీఎస్ఆర్ ఈఐఎస్ మరియు జ్యోతిబాపూలే బీసీ గురుకులాలలో బోధనా సమయాన్ని ఇతర సొసైటీలో మాదిరిగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగున్నర వరకు ఉండే విధంగా మార్చాలి.పదోన్నతుల, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని అన్ని సొసైటీలలో నెల మొదటి తేదీన వేతనాలు ఇవ్వాలని, పారిటీ స్కేల్స్ అమలు చేయాలని ,ఆరోగ్య కార్డులు అందజేయాలని, మెడికల్ రీయంబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలని, ప్రత్యేకంగా కేర్ టేకర్ ,డిప్యూటీ వార్డులను నియమించాలని ,సిఆర్టిల సర్వీసు రెగ్యులర్ చేయాలని ,కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్ టైం ,అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే మరియు 12 నెలల వేతనం ఇవ్వాలని ,2007లో రెగ్యులర్ అయిన ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీసు, పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని, ఆర్ట్ క్రాఫ్ డ్రాయింగ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించాలని ,విద్యార్థుల మెస్ చార్జీలపెంపు ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని, అన్ని గురుకులాలకు శాశ్వత భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని ,201819లో నియామకమైన ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు ఇవ్వాలని, మైనారిటీ రెసిడెన్షియల్ టీచర్లకు ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ పిఆర్సి బకాయిలు చెల్లించాలని,ఆదివారం పండుగ సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్లీ ఆఫ్ వర్తింపచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి శ్రీనివాసరెడ్డి జిల్లా కోశాధికారి జి వెంకటయ్య ,రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జే యాకయ్య, గురుకుల పాఠశాలల కన్వీనర్ భరత్ కుమార్ ,జిల్లా కార్యదర్శులు ఎం వెంకన్న ,ఆర్ దామోదర్ ,ఎం నాగేశ్వరరావు, వి రమేష్ బి ఆడం వివిధ యాజమాన్యాల బాధ్యులు కృష్ణమూర్తి ,డి రాములు ,జావిద్ పటేల్ ,ఎం శ్రీనివాస్, సుధాకర్ ,లక్ష్మి , పుష్పావతి ,అనిత తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తి గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరవెయ్యడం ఖాయం

**నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దారావత్ రాజేష్**

**పాలకుర్తివిశాలభారతి:** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రం లోని రెడ్డి గార్డెన్స్ లో పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దారావత్ రాజేష్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షులు మాట్లాడుతూ" స్థానికేతరుడైన ఎర్రబెల్లి దయాకర్ రావు ను ఈ సారి పాలకుర్తి నియోజకవర్గం నుండి ఓటమితో సాగనంపుతాం అని ఈ పాలకుర్తి నియోజకవర్గానికి దయాకర్ రావు చేసింది ఏమి లేదు అని పాలకుర్తి మండల కేంద్రం లో ఇంటర్ కాలేజీ గాని డిగ్రీ కాలేజీ గాని తీసుకురాలేని దయాకర్ రావు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా పాలకుర్తి నియోజకవర్గంలో రోజుకో మీటింగ్ పెట్టుకుంటూ ప్రజలకు మాయ మాటలు చెప్తుతూ మోసం చేస్తున్నాడని అన్నారు. పాలకుర్తి గడ్డ మీద హనుమండ్ల ఝాన్సీ రెడ్డి నాయకత్వం లో కాంగ్రెస్ జెండా ఎగరవెయ్యడం కోసం పాలకుర్తి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు గెలుపే ధ్యేయంగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేసారు కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చెయ్యడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగాల సందీప్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్య నాయక్ మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమార్ స్వామి గౌడ్, దారావత్ సురేష్ నాయక్, మాచర్ల ప్రభాకర్, జక్కుల రాం రెడ్డి, ముద్దసాని సురేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు హరీష్, దుడిమెట్ల యాకేష్ యాదవ్, ఉప్పాల అనిల్, బిసు హరిక్రిష్ణ, ఎండీ మహమ్మద్,తొర్రుర్ యూత్ నాయకులు అభిరామ్, సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, మల్లా రెడ్డి, తిరుపతి రెడ్డి, దామోదర్ రెడ్డి, సోమ నర్సయ్య కారుపోతుల శ్రీనివాస్, చెవిటి సాధాకర్ మరియు వివిధ మండల నాయకులు సోమ రాజశేఖర్ భైరు భార్గవ్ గోనె మహేందర్ రెడ్డి కుమార్ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు,అన్ని గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బంచరాయితండలో ఎమ్మెల్యే రెడ్యాకు ఘనస్వాగతం

**మహబూబాబాద్ విశాలభారతి:**
పల్లె పల్లెకు అభివృద్ధి యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని సూర్య తండా, నల్లెల్ల, పిల్లగుండ్ల తండా,తాటియా తండా,బంచరాయి తండా, కొత్తూరు జీ గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ యాత్రలో కార్యకర్తలు, ప్రజలు ఆట పాటలతో కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రెండు నెలల్లో గ్రామాలకు, తండాలకు సిసిరోడ్లు, డబుల్ బెడ్రూం గృహాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి గుగులోత్ పద్మావతి, జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు తోట లాలయ్య, నాయకులు వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిపి గుడిబోయిన రామచంద్రయ్య, గుగులోత్ రవినాయక్, ఉమ్మడి కొత్తూరు గ్రామపంచాయతీ మాజీ



సర్పంచ్ పున్నం, బంచరాయితండ బి.ఆర్.ఎస్ నాయకులు బానోత్ రామారావు, భానోత్ సూర్య సర్పంచులు, ఎంపిటిసిలు, యువ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**దేవరుప్పులవిశాలభారతి:** దేవరుప్పుల మండలంలోని మాధపురం గ్రామానికి చెందిన బేజగం చిన్న ఎల్లయ్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిసిసి సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ సోమవారం వారి చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకుని అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షడు చిలుకాని శ్రీశైలం, ఎనుగుతల కొమురయ్య, గుర్రం అంజయ్య, బెజగం సోమకొండయ్య, మొటిక ఐలమల్లు, చిలుకాని యాకయ్య, జెట్టి యాధ సోమయ్య, గుర్రం సోమయ్య, లకవత్ భాగ్యా నాయక్, లకావత్ యాకు, గుర్రం సోమకొండయ్య, హనుమంతు, ప్రవీణ్, చిలుకాని అశోక్, హైమత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై ఆందోళనలకు సిద్ధం

**టియుడబ్ల్యుజె (ఐజెయు ) మేడ్చల్ జిల్లా కార్యవర్గం నిర్ణయం.**

**కూకట్ పల్లివిశాలభారతి:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఎప్పుడు ముందుంటుందని సంఘం రాష్ట్ర కోశాధికారి కొలను మహిపాల్ రెడ్డి అన్నారు. టి యు డబ్ల్యు జే(ఐ జే యు )మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన సోమవారం కూకట్ పల్లి లో కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. జిల్లా లో ఇళ్ల స్థలాలు, యూనియన్ బలోపేతం పై దృషి సారించాలన్నారు. ఇందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోతె వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యాల విషయం లో జాగ్రత్త గా ఉండాలన్నారు. కూకట్ పల్లి రాందేవ్ రావు అస్పత్రి లో రాయితీ తీసుకునట్లుగా జిల్లా లోని ఇతర ప్రాంతాలలో కూడా అస్పత్రి వర్గాలతో చర్చించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లా జర్నలిస్టుల పక్షాన పోరాటం చేస్తున్న ఘనత మన సంఘానిదేనన్నారు. ఇప్పటి కే జిల్లా లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ తో కూడిన విద్య కోసం జిల్లా విద్యాధికారి తో చర్చించడం జరిగిందని తెలిపారు. సంఘం పటిష్టం కోసం ఈ నెల లో నియోజకవర్గ సమావేశాలను నిర్వహించాలని కోరారు. ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే లతో వెంటనే నియోజకవర్గం కమిటీ లు చొరవ చూపాలని తెలిపారు. ఇప్పటికే జిల్లా లోని ఎమ్మెల్యే లతో మాట్లాడటం జరిగిందన్నారు. రాష్ట్ర మాఫిసిల కమిటీ సభ్యులు మామిడాల రవీందర్ మాట్లాడుతూ ఐక్యత తో పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లా లో ఎమ్మెల్యేలందరిని కలిసి ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించి పరిష్కారమార్గాలను చూడాలన్నారు. సమావేశం లో జిల్లా కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

**కమిటీల నియామకం**

ఈ సందర్భంగా ఐదుగురు సభ్యులతో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అదహాక్ కమిటీ నియమించారు. ఇందులో దామోదర్ రెడ్డి (కూకట్ పల్లి ) లక్ష్మణ్ (కుత్బుల్లాపూర్ ), హరీష్ (ఉప్పల్ ) పవన్ (మల్కాజగిరి), రాజేష్ (మేడ్చల్ ) లు నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ గా తొట్ల పరమేష్, దాడుల నిరోధక కమిటీ కన్వీనర్ గా గుంటూరు శేఖర్ (కుత్బుల్లాపూర్ ), మాఫిసిల్ కమిటీ కన్వీనర్ గా కృష్ణ (జిల్లా స్టాఫ్ఫర్ ), ఆరోగ్య కమిటీ కన్వీనర్ గా విజయ్ (కాప్రా ), కో కన్వీనర్ గా చంద్ర మౌళి ( ఉప్పల్ ) లు నియమితులైనట్లు ప్రకటించారు.



## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలలో 50 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం సరైన పద్ధతి కాదు. గ్రామాలలో జరిగే ప్రభుత్వ నుంచి పనుల్లో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. తెలంగాణ ఉద్యమంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర క్రియాశీలకంగా ఉంది. ప్రభుత్వం చేపట్టిన గ్రామాలలోని పలు కార్యక్రమాలలో గ్రామపంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూనే వస్తున్నారు. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పడితే కార్మిక కర్షక నిరుద్యోగ ఉద్యోగ అనేక రకరకాల వర్గాలకు చెందిన వారి సమస్యలు పరిష్కరించ బడుతాయని తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరు క్రియాశీలకంగా పాత్ర పోషించిన వారే.

గ్రామపంచాయతీ కార్మికుల్లో నూటికి 80% దళిత అట్టడుగు వర్గాలకు చెందిన వారే సిబ్బందిగా మురుగు కాలువలను తీస్తూ అనారోగ్యాలను లెక్కపెట్టకుండా మురుగు నీటిలో మునిగి తేలుతూ చాలీచాలని వేతనాలతో జీవనాన్ని కొనసాగిస్తారు. మురుగును చూస్తేనే సేదరించుకునే రోజుల్లో అత్యంత మురుగునీటితోపాటు వ్యర్థాలను పారిశుద్ధ్య పనులను నిత్యం చేస్తూ తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా కృషి చేస్తున్నటువంటి గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు వారు కోరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని నెరవేర్చి గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన హక్కులను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు స్వీపర్లు పంపు ఆపరేటర్లు ఎలక్ట్రిషన్లు డ్రైవర్లు కారోబార్లు బిల్ కలెక్టర్ వివిధ కేటగిరీలలో పనిచేస్తున్నారు. గ్రామాలలో గత 30 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయకుండా కనీసం వారికి ఉద్యోగ భద్రత కల్పించకుండా గత పాలకులు చేసిన నిర్లక్ష్యమే నేడు పాలకులు అదే అవలంబించడంతో స్వరాష్ట్రం సాధించుకున్నది ఇందుకేనా అనే ప్రశ్న గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో పెద్ద ఎత్తున నినాదాలు చేపడుతున్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి పిఆర్సి లో నిర్ణయించిన బేసిక్ ప్రకారం పంచాయతీ సిబ్బందికి 19,000 ఆలోపు జీవో నెంబర్ 60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీల వారిగా పంచాయతీ సిబ్బందికి 15,600 కారోబార్ బిల్ కలెక్టర్లకు ఇతర స్కిల్డ్ సిబ్బందికి 19500 చెల్లించి కారోబార్ బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతి కార్యదర్శులకు ప్రమోషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు కోరుతున్నారు. నూతనంగా తీసుకువచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే వివిధ కేటగిరీలుగా యధావిధిగా గ్రామపంచాయతీ సిబ్బందిని కొనసాగించాలని న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వారు గత 12 రోజులుగా నిరవదిక సమ్మెను చేపడుతున్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం గ్రామాల విస్తరణతో పాటు జనాభా విస్తరణ పెరగడంతో ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. జీవో నెంబర్ 51 విడుదలకు ముందు పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందులు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించలేదు అదనంగా నియమించిన కార్మికులకు పంచాయతీ కార్మికులకు గుర్తించి అందరికీ సమానంగా వేతనాలు ఇవ్వడం లేదు వేతనాలు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలి కొత్తగా నియమింపబడే వారికి సంబంధించి గ్రామపంచాయతీ తీర్మానం చేసి డిపిఓ ఆమోదం ద్వారానే నియమకాలను అమలు చేయాలని అలాంటి నియమకాలు చేయకుండా అక్రమ నియమకాలను చేపడుతూ ,గ్రామాలలోని సర్పంచులు వారి యొక్క దగ్గర అనుచరులతో వారికి సానుకూలంగా ఉండే వ్యక్తులను గ్రామపంచాయతీ వ్యవస్థలో సిబ్బందిగా ఉంచుతూ వారితో గోడ్డు చాకిరి చేయించుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 51 తీసుకువచ్చి మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టింది గ్రామ పంచాయతీలలో వివిధ రకాల కేటగిరీలన్నిటిని రద్దుచేసి కలం పట్టిన కారోబార్ బిల్ కలెక్టర్ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం పేరుతో ఏ పనైనా చేయాలని బలవంతంగా బాండ్ పేపర్ల పై సంతకాలు చేయించుకుని కార్మికులను వేధింపులకు గురిచేస్తూ పనిలో నుండి తొలగిస్తూ సిబ్బందితో నైపుణ్యం లేని పనులు చేయించడంతో అధికారుల ఒత్తిళ్లకు తట్టుకోలేని పరిస్థితుల్లో కొంతమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడానికి వెనకాడడం లేదు. నైపుణ్యతతో కూడిన ట్రాక్టర్ డ్రైవర్లు లేకపోవడంతో అనేక మంది గ్రామపంచాయతీ సిబ్బందితోనే ట్రాక్టర్లు నడిపించడంతో కార్మికులు ట్రాక్టర్ల ప్రమాదంతో మృతి చెందిన సంఘటనలు పలు గ్రామాలలో చోటుచేసుకున్నాయి.

కార్మికులందరికీ వేతనాలు పెంచడంతోపాటు కార్మికులను పర్మినెంట్ చేస్తూ గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని పెద్ద ఎత్తున 12 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు పోరాటం చేస్తున్నారు కార్మికులపై వేధింపులు అక్రమ తొలగింపులతో పాటు గ్రామాలలోని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు బెదిరింపులకు పాల్పడడం సొంత అవసరాల కోసం పనులను చేయించుకోవడం పనులు చేయని యెడల ఉద్యోగం నుంచి తొలగింపు లాంటి చర్యలను చేపడుతున్నందున సమగ్రమైన ఉద్యోగ భద్రతను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడెలను రద్దు చేస్తూ గ్రామపంచాయతీ సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు అమలు అయ్యే విధంగా సమగ్రమైన ఆలోచన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలి. గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బందికి సంవత్సరానికి మూడు జతల యూనిఫాం సరిపడ చెప్పులు సభ్యులు నూనెలు అలవెన్స్ గా నగదు రూపంలో ప్రభుత్వం చెల్లించాలి. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగంతో పాటు సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని ఐదు లక్షలకు పెంచి వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలి ఎనిమిది గంటల పని తినాలని అమలు చేస్తూ వారాంతపు సెలవులు పండుగ సెలవులు జాతీయ ఆర్జిత సెలవల దినాలను అమలు చేసి కార్మికులను ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయి. స్వరాష్ట్ర పాలనలో కార్మిక వర్గం ఎంతో లబ్ధి చేకూరుతుందని నాడు జరిగిన ఉద్యమంలో కార్మిక లోకం నిరంతరం తమదైన శైలిలో గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారు. ప్రస్తుతం అమలవుతున్న వేతనాలు సకాల సమయానికి రాకపోవడంతో పేద వర్గానికి చెందిన కార్మికులు కుటుంబ పోషణతో పాటు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి అనేక సమస్యలతో సతమతమవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు అందే వేతనాలనైనా సరైన సమయానికి కార్మికుడికి అందజేస్తే చాలీచాలని జీతాలతోనైనా కాస్త అప్పుల భారం కాకుండా సమయానికి కాస్త కూసో కుటుంబాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కార్మికులు పాటుబడతారు. మూడు నాలుగు నెలలకు ఒకసారి జీతాలు వేయడంతో కార్మికులు తెచ్చుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక ఊర్లోని దళిత వర్గాలకు చెందినటువంటి కార్మికులు ఎక్కువగా ఉన్నందున వారికి అందే వేతనం సరైన సమయానికి అందకపోవడంతో అనేక అవస్థలు పడుతున్న సందర్భాలు గ్రామీణ ప్రాంతంలో నేటికీ అమలు అవుతూనే ఉన్నాయి .మురుగు తీసే కార్మికులకు కనీసం గౌరవం ఉండే విధంగా వ్యక్తి చాకిరి నుంచి విముక్తి కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంపై వివిధ రూపాలలో ఉద్యమ కార్యచరణను తీసుకొని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు గ్రామపంచాయతీ కార్మికులతో పాటు వివిధ రంగాలలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు అండగా ఉండాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నది.

**వేముల గోపీనాథ్**
**తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు**



## రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఈటెల రాజేందర్

**మెట్టుగూడ,విశాల భారతి:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని బోనాల ఉత్సవాల్లో భాగంగా చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ లోని శ్రీశ్రీశ్రీ మావురాల రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం లో రాష్ట్ర బిజెపి ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వర్షాలు పడి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ కేశ బోయిన బాబురావు, శోభ, కమిటీ సభ్యులు మల్లేష్, శారదా మల్లేష్, కేశ బోయిన ఆదర్శ్ కుమార్, మురళి, రాజు, విజయ్, సింహాచలం, బాబు ఆలయ తీర్థ ప్రసాదాలను ఈటెల రాజేందర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్పి రాజేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, కిషోర్ కుమార్, బండపల్లి సతీష్ గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, మేకల సారంగపాణి, కనకట్ల హరి, ప్రభు గుప్తా, కందాడి నాగేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## కుట్రపూర్వకంగానే కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి

**పాలేరు విశాలభారతి :** తిరుమలయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలపై జరిగిన దాడిని ఖండిస్తూ దాడి చేసిన వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. స్పందించిన సీఐ దాడులు చేసిన వారిపై కేసులు చేస్తా అనడంతో ధర్నా విరమించారు. అనంతరం మీడియాతో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరావు మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గస్థాయిలో అధికార బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోలీసు వ్యవస్థని కంట్రోల్లో పెట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తల పైన దాడి చేయించి మళ్లీ తిరిగి వాళ్లపై కేసులు పెట్టి కేసు విరమించుకునేందుకు పార్టీ ఆఫీసుకు పిలిపించి మా పార్టీలో చేరాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.ఇంతకముందు కూడా మండల పార్టీ అధ్యక్షుడు పై కేసులు ఉన్నాయి. అవన్నీ పక్కకు పెట్టేసి పోలీస్ వ్యవస్థ నీరు కారుస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేక నినాదంగా న్యాయం జరిగేటు సోమవారం తిరుమలాయపాలెం నందు ధర్నా నిర్వహించాలి అని అనుకున్నాం కానీ పోలీస్ ఉన్నత అధికారులు మీకు న్యాయం చేస్తాము అని అన్నారు కనుక ధర్నా వాయిదా వేయడం జరిగింది. న్యాయ పోరాటాలకు పోలీసు వ్యవస్థ వ్యతిరేకంగా పని చేస్తుందని వారి తీరు మార్చుకొని న్యాయానికి పనిచేయాలని అన్నారు. కేసులు చేయకపోతే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి ఆందోళన చేపడతామన్నారు. వారు ఏ పార్టీ వారికైనా న్యాయంగా పనిచేయాలని పోలీసు వ్యవస్థను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పిసిసి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శేఖర్ గౌడ్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్ జూలకంటి సాగర్ రెడ్డి పోట్ల కిరణ్ నాగేశ్వరరావు లింగయ్య ఎంపీటీసీ పాపా నాయక్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ వివిధ గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీను రమణ భద్రు దేవేందర్ వెంకన్న మల్లయ్య అంజయ్య రాజేందర్ ఆశీర్వాదం ఖాదర్ శంకర్ మధార్ ఉపేందర్ ఎన్ యస్ యు ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు జి.మోహన్ యూత్ కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ బత్తుల రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు నాగుల్ మీరా రాజేందర్ సాయి వేణు ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా

**ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పాలకుర్తి విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న ఎర్రబెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తిలో డ్రైవింగ్ లైసెన్స్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేళాను సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖల మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ జులై 17 నుండి జులై 31వ వరకు 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలన్న లక్ష్యంతోనే ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని మంత్రి సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరమన్నారు. అందుకే తాము ఈ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలకుర్తి లోని పార్టీ కార్యాలయంలో అప్లికేషన్స్ తీసుకుంటారని, దరఖాస్తుతోపాటు 1) ఆధార్ కార్డు. 2) పాన్ కార్డు. 3) టెన్త్ సర్టిఫికెట్. 4)రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, దరఖాస్తులు మాత్రం పాలకుర్తిలోనే ఇవ్వాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలి

**హుజూర్ నగర్ విశాలభారతి:** మఠంపల్లి గ్రామంలో కొలువైయున్న శ్రీ గోపయ్య శ్రీ లక్ష్మి తిరుపతమ్మ దేవస్థానము నందు సోమవారం అన్ని రకాల కూరగాయలతో స్వామివారిని అమ్మవారిని అలంకరించారు. అమ్మవారు శాకంబరీ రూపంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మఠంపల్లి ఓజో ఫౌండేషన్ ఇంచార్జి వల్లపు దాసు రామాంజి గౌడు అమ్మవారిని దర్శించుకుని ఓజో ఫౌండేషన్ అధినేత పిల్లుట్ల రఘు చేయూత ద్వారా 50 కేజీల బియ్యం పులిహోరకు దేవస్థానం అర్చకులకు అందజేశారు. ఇటువంటి దైవ కార్యక్రమాలకు రఘు అన్న అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి గార్ల కృపాకటాక్షం రఘు అన్నకు ఎల్లవేళలా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మనసారా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లి ఓజో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి జగదీశ్వర్ రెడ్డి అధ్వర్యంలోనే జిల్లా అభివృద్ధి

**- సంజయ్ దాస్**



**చిట్యాలవిశాలభారతి:** విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అధ్వర్యంలోనే నల్లగొండ జిల్లా అభివృద్ధి జరిగిందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ అన్నారు. ఈ నెల 18వ తేదీన మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిండు నూరేళ్ళు ఆయు ఆరోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ వేములవాడ రాజన్న గుడిలో రుద్రాభిషేకం చేసి కోడె మొక్కును ఇవ్వడం జరిగింది. అనంతరము సంజయ్ దాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వం లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ను అభివృద్ధి పథంలో మంత్రి జగదీష్ రెడ్డి నడిపారని అన్నారు. మెడికల్ కాలేజీలు, యాదద్రి థర్మల్ ప్లాంట్, ప్రజల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పన కోసం మంత్రి జగదీష్ రెడ్డి ఏనలెని కృషి చేశారన్నారు. వచ్చే ఎన్నకల్లో సీఎం కేసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో మంత్రి జగదీశ్ రెడ్డి నాయత్వంలో జిల్లాల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని ఎమ్మెల్యే స్థానాలను అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయం అన్నారు. సంజయ్ దాస్ వెంట బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు వెల్దుర్తి రాజు చారి, అరూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

## మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలి




**కోదాడవిశాలభారతి:** దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలిత అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్ లో కౌన్సిలర్ కల్లూరి పద్మజ సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 50 మంది (టైలరింగ్ 25) (బ్యూటీషియన్ 25) మహిళలకు సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల ఆరోగ్యం, భద్రత, విద్య, సంక్షేమం కోసం రాష్ట్రంలో చేపట్టిన చర్యలు దేశంలో మరెక్కడా లేవని అన్నారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. మహిళలు ఇంటి వద్ద ఉండి ఆదాయం పెంచుకొని కుటుంబ పోషణకు ఆసరాగా ఉండేందుకు అనేక కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు అవసరమైన వారికి కుట్టు మిషన్లు అందజేస్తామని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ కల్లూరి పద్మజ, స్టాండింగ్ కమిటీ చైర్మన్ చంద్రకళ, డిస్టిక్ మేనేజర్ అనిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన సుధారాణి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చందు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కోట మధు, కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్ యాదవ్, మామిడి రామారావు, ఖదీర్ పాషా, గుండెల సూర్యనారాయణ, ఖాజా మొయినుద్దీన్, మదర్, మైస రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవార్ల అల్లయాలను దర్శించుకున్న పాండురంగా రెడ్డి

**పటాన్ చెరువిశాలభారతి :** ఆషాడ మాసం బోనాల పండుగను పురస్కరించుకొని.. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని అమ్మవార్ల దేవాలయాలను ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లకు కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాషెట్టి కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, చంద్రశేఖర్, యువ నాయకుడు రుష్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రామచంద్రాపురంలో వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు

- ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు
- పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ
- అమ్మవారికి కాట శ్రీనివాస్ గౌడ్ పూజలు

**పటాన్ చెరు-విశాలభారతి :** ఆషాడ మాసం సందర్భంగా రామచంద్రపురంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురంలోని పోచమ్మ అమ్మవారి దేవాలయంలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పూజలు నిర్వహించారు. రామచంద్రపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద 112 డివిజన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎస్ యుఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అవినాష్, 111 డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ నవీన్ గౌడ్, జనరల్ సెక్రటరీలు నాగేష్, పాషా, సామ్రాట్, మైనార్టీ ప్రెసిడెంట్ హబీబ్ జాని, శాంతమ్మ, హరీష్ గౌడ్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ తాహిర్, పీటర్, శ్రీరాములు, మహిపాల్ గౌడ్, అన్వర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నల్ల పోచమ్మ


# ఆలయ కమిటీ చైర్మన్ గా రవీందర్ రెడ్డి

**బొల్లారం మున్సిపాలిటీవిశాల భారతి:** బొల్లారం పారిశ్రామిక వాడలోని నల్ల పోచమ్మ దేవాలయానికి జిన్నారం మండల మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బషీర్, శ్రీశైలం, శివ కృష్ణ, బంగారు రాజు, బాలయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ఓసి అందచేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు-విశాలభారతి :** ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన రంగయ్య శెట్టి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన 90 వేల రూపాయల ఎల్ఓసి నీ సోమవారం రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.





# అమీన్ పూర్ లో అంగరంగ వైభవంగా బోనాలు

- పోచమ్మ తల్లికి 'కాట' దంపతుల పూజలు

**పటాన్ చెరువిశాలభారతి :** ఆషాడ మాస బోనాల సందర్భంగా అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ హోమ్స్ కాలనీ, అమీన్ పూర్ గ్రామంలోని పోచమ్మ అమ్మవారి దేవాలయంలో కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ ఆయన సతీమణి కాట సుధాతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ మన్నె రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మున్నా, మున్సిపాలిటీ ప్రెసిడెంట్ శశిధర్ రెడ్డి, జనరల్ సెక్రటరీలు మహేష్, రమేష్ యాదవ్, నాయకులు రవీందర్, ప్రకాష్, సత్యనారాయణ, బిక్షపతి, ఈశ్వర్ రెడ్డి, సతీష్, అప్పారావు, లక్ష్మణ్, సత్తయ్య, ఎన్ నరసింహ, కుమార్, దీపక్ గౌడ్, కె.నరసింహ, శ్రీరాములు, ఎ బాలకృష్ణ, టి.అశోక్, టి నరసింహ, ఆర్. వెంకటేష్, పూర్ణచందర్, దేవయ్య, భిక్షపతి, సత్యనారాయణ, తదితరులు



పాల్గొన్నారు

**తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఘనంగా బోనాలు..**

ఆషాడం మాసం బోనాల సందర్భంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఐజి విద్యుత్ నగర్ లో బోనాల ఉత్సవంలో అమ్మవారిని దర్శించుకుని, కాలనీలో పలు తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలలో కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. తెల్లాపూర్ గ్రామంలో నవారి శ్రీనివాస్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ రవీందర్, శ్యామ్ రావు, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారి శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మాధవరెడ్డి, జైపాల్ రెడ్డి, అరుణ్ గౌడ్, తురుపు శ్రీను, వినోద్ కుమార్, పెంటయ్య, కుమారి నర్సింలు, వీరారెడ్డి, సుధాకర్ రెడ్డి, వాజీద్, అక్రమ్, ఆశీర్వాదం, మొగులయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కలకలం రేపుతున్న మెడికో సూసైడ్ అటెంప్ట్.

**నిజామాబాద్ బ్యూరో, విశాల భారతి:** మెడికో సూసైడ్ అటెంప్ట్ కలకలం రేపింది. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మెడికో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన సోమవారం ఉదయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన యువతి (20) అనే విద్యార్థిని గుర్తు తెలియని మాత్రలు మింగి సూసైడ్ అటెంప్ట్ చేసింది.ఈ సంఘటన ఆదివారం జరిగింది. సదరు విద్యార్థిని అపస్మారక స్థితికి చేరుకోవడంతో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు హాస్టల్‌లో ఉండే మరో విద్యార్థినితో గొడవ కారణం అని వైద్య కళాశాల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నదని వైద్యులు తెలిపారు. వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి వేధింపులే కారణం అనే వాదనలు ఉన్నాయి. వేధింపులు భరించలేకనే శనివారం 5 మాత్రలు, ఆదివారం 10 మాత్రలు ఓవర్ డోస్ అయ్యేలా వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికో ఆత్మహత్యాయత్నం వ్యవహారం బయటకు పొక్కకుండా అధికారులు చాలా ప్రయత్నాలు చేశారు. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు నెలల కాలంలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా, మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపుతోంది. ఆసుపత్రి అధికారులు విద్యార్థిని పారాసిటమల్ ట్యాబ్లెట్ వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిందని చెబుతున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అనడం పలు అనుమానాలు సాధిస్తుంది.



# బొల్లారంలో ఘనంగా బోనాల ఉత్సవం

**బొల్లారం మున్సిపాలిటీ విశాల భారతి:** జిన్నారం మండలం బొల్లారంలో ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపారు. బోనాల సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరి మొక్కులు చెల్లించారు. భక్తులు కుటుంబ సమేతంగా బోనాలను అమ్మవార్లకు సమర్పించారు. ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజా బాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి, మాజీ ఎంపిపి కోలన్ రవీందర్ రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.



# ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు.

**తార్నాక,విశాల భారతి:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని లాలాపేట లోని శివ శంకర్ (యాక్టర్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇందిరానగర్, సత్య నగర్ కాలనీలో ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా ఉత్సాహంగా భక్తి శ్రద్ధల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ తీగుల్లా పద్మారావు గౌడ్,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రామేశ్వర్ గౌడ్, కిషోర్ గౌడ్, త్రినేత్ర గౌడ్ హాజరై పలహారం బండి ఊరేగింపులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి, సునీల్ ముదిరాజ్, కోళ్ల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- బీఆర్ఎస్ నేత నీలం మధు ముదిరాజ్
- బొల్లారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**పటాన్ చెరువిశాలభారతి:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నేత నీలం మధు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక తెలంగాణ సాధించిన తర్వాతనే బోనాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. విదేశాలలో సైతం బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి మరోసారి ఆశీర్వదించాలని అమ్మవారిని కోరినట్టు ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరిపై అమ్మవారి దయ ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజేర్ ఆనంద్ కృష్ణ రెడ్డి, భారత్




చారి, యాదయ్య చారి, ఆనంద్ చారి, అశోక్ చారి, శ్రీనివాస్ చారి, వెంకటేశ్ చారి, విష్ణు చారి, కృష్ణ, శంకర్, అన్వర్, శ్రీను, జాతర నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ సంకల్ప రథయాత్రను జయప్రదం చేయండి

**మహబూబాబాద్ విశాలభారతి:** టి.ఎస్.సి.పిఎస్.ఈ.యు బయ్యారం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ బయ్యారం బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ నెల 20వ తారీకున బయ్యారం మండలానికి పాత పెన్షన్ సాధనకై వస్తున్న సంకల్ప రథ యాత్రను విజయవంతం చేయటంలో మా మద్దతు ఉంటుందని అన్ని ఉపాధ్యాయుల సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఈ కార్యక్రమంలో టి.ఎస్.సి.పిఎస్.ఈ.యు బయ్యారం మండల అధ్యక్షులు భానోత్ రవీందర్ నాయక్, శ్రీకాంత్ నాయక్, యు.టి.ఎఫ్ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గంగావత్ వెంకన్న,



రమణమ్మ, టి.ఎస్.టి.టి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి రామారావు, టి.పి.టి.ఎఫ్ అధ్యక్షులు ఎస్.కె మీరా, ఎ.టీ.ఎఫ్ అధ్యక్షులు గీతాపల్లి కృష్ణ, టి.ఎస్.సి.పి.ఎస్.ఈ.యు జిల్లా నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.



# 'బీఆర్ఎస్ బలోపేతానికి కృషి'

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ యువజన విభాగం 7వ వార్డు అధ్యక్షుడు వినోద్ తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు.





# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం.

తార్నాక,విశాల భారతి: లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం రామ్ టాకీస్ ఎదురుగా పోచమ్మ దేవాలయం వద్ద గో సేవ,గో ప్రదక్షణ, గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు నేతి రాముల గుప్తా, అధ్యక్షులు ఎని శెట్టి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎలాగందుల లక్ష్మణరావు, కోశాధికారి ఇంగు వెంకటేశం హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అమావాస్య అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు గుప్తా మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా గోమాతకు పూజలు, ప్రదర్శనలు చేస్తే ముక్కోటి దేవతలకు ప్రదక్షిణలు చేసినంత పుణ్యం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సంఘం ప్రతినిధులు సభ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య లోపం..

- పన్నెండు రోజులుగా సమ్మెలో పంచాయతీ కార్మికులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా అంతంత మాత్రమే
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

**జఫర్‌గఢ్-విశాల భారతి:**



గత పన్నెండు రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ జరగడం లేదు. గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నది.చెత్త సేకరణ జరగడం లేదు. సమయానికి నల్లల ద్వారా నీటి సరఫరా కావడం లేదు. వీధి దీపాల నిర్వహణ జరగడం లేదు. కార్మికులకు ప్రత్యామ్నాయంగా కూలీలను పెట్టినప్పటికీ అంతగా పనులు జరగడం లేదు. తమ సమస్యలను తీర్చాలంటూ ఈనెల 6వ తేదీ నుండి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. జనగామ జిల్లాలోని జఫర్గడ్ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులతో పాటు కారో బార్లు కూడా సమ్మె చేస్తున్నారు.కార్మికులు చాలి చాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారు. పారిశుధ్య పనులతో గ్రామాలను శుభ్రంగా ఉంచే కార్మికుల గోడును మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తమకు కనీస వేతనాలను అమలు చేయాలనీ మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదు.ఒక్కో పంచాయతీలో సపాయి, వాటర్ సప్లయర్, ఎలక్ట్రీషియన్,కారోబార్ ఉంటారు. నెలవారి వేతనాలు కూడా సకాలంలో అందని పరిస్థితుల్లో కూడా పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు.ఈ క్రమంలో అనేకసార్లు వేతనాల పెంపు కోసం డిమాండ్లతో సాధనకు నిరసనలు ధర్నాలు చేశారు.2019 సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో 34రోజుల పాటు విధులు బహిష్కరించి సమ్మె చేయడంతో ప్రభుత్వం సపాయి, వాటర్ సప్లయర్, ఎలక్ట్రిషన్ ను కలిపి మల్టీ పర్పస్ వర్కర్ గా కార్మికులను మార్చింది. నెలకు 8.500 రూపాయల వేతనం ఇస్తూ వచ్చింది..

**ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన :**
సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కార్మికులకు మాత్రం ఆ మేరకు జీవో 60 తీసుకువచ్చి నెలకు 16,500 రూపాయల వేతనం చెల్లిస్తున్నారు. కానీ పంచాయతీ కార్మికులకు ఆవేతనం ఇవ్వడం లేదు. అలాగే పిఆర్సి ప్రకారం 30శాతం వేతనాలు పెంచితే 11.550 వేతనం వచ్చేది. ఆ లెక్కన ఇప్పటివరకు ఒక్కో కార్మికుడు 50 వేల రూపాయల వరకు నష్టపోయాడు.దీంతో మరో సీఐటీయూ అనుబంధ తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు సమ్మె చేస్తున్నారు.ఎంపీడీవో కార్యాలయం వద్ద టెంట్లు వేసి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. మున్సిపల్ కార్మికుల వలె తమకు నెలకు 16,500 వేతనం ఇవ్వాలని మల్టీపర్పస్ వర్కర్స్ జీవోను రద్దు చేయాలని రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పండుగ దినాలు,ఆదివారాలు సెలవులు ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కారోబార్ లను గ్రామ సహాయకులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. సోమవారం పంచాయతీ కార్మికులు వంట వార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వాటర్ సప్లై తదితర పనుల విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త పేరుకు పోతుందని ప్రజలు చెబుతున్నారు.

### నెలలు 16.500 వేతనం ఇవ్వాలి



జఫర్ గడ్ మండలంలోని ఓబులాపూర్ జీపీలో గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్నాను. చాలి చాలని జీతంతో ఇబ్బంది పడుతున్నాం.ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామ పంచాయతీ పనులు చేస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కష్టమునకు ఫలితంగా జీతాలు పెంచాలి.మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా నెలకు రూ.16.500 వేతనం ఇవ్వాలి.

- అశోక్ గ్రామ పంచాయతీ సిబ్బంది,ఓబులాపూర్


### కార్మికులకు అండగా కాంగ్రెస్ ఉంటుంది



తాటికాయల రాజేందర్ - కాంగ్రెస్ పార్టీ

పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ వైస్ ప్రసిడెంట్ తాటికాయల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా పంచాయతీ కార్యదర్శులు జీతాలు పెంచాలని తదుపరి సమస్యలపై దీక్షలు చేస్తున్న విషయం విధితమే.వారి సమస్యలపై ప్రభుత్వం వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు వారికి సంఘీభావం తెలుపుతున్నట్లు కూడా ప్రకటించారు.

### మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి. జీవో 60 ప్రకారం కనీస వేతనం అమలు చేయడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. కొన్ని సంవత్సరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాం. ఇప్పటికైనా మా కష్టాలను ప్రభుత్వం గుర్తించి మమ్మల్ని ఆదుకోవాలి.

- ఠాకూర్ వివేక్ సింగ్ గ్రామ పంచాయతీ ఉద్యోగి,జఫర్గడ్

# విలేకరి ఇంటిపై దాడి

- కారు వెనక అద్దం, ఇంట్లో చొరబడి సామాన్లు ధ్వంసం
- కక్ష పూర్వకంగానే చేసినట్టు అనుమానం
- తీవ్రంగా ఖండించిన సిపిఎం,సిపిఐ, వైయస్సార్ టిపి,బిఆర్ఎస్,కాంగ్రెస్ నాయకులు
- ఎంక్వయిరీ మొదలు పెట్టిన పోలీసు యంత్రాంగం
- త్వరలోనే పట్టుకుంటామని వెల్లడి.
- ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నం చేస్తున్నారు
- మండల ప్రెస్ కమిటీ.



**పాలేరు విశాలభారతి:**కలం పట్టి సమాజంలో తెర వెనక జరుగుతున్న అక్రమ, అన్యాయాలను, ప్రజలకు తెలియజేసే విధంగా మీడియా రంగ ప్రవేశం చేసిన బోడపట్ల సతీష్ గౌడ్ అంచలంచెలుగా ఎదుగుతున్నాడని గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఎవరి తరం కాదు..అని ధైర్యాన్ని అందజేశారు. మండల పార్టీ కమిటీ నాయకులు...దమ్మాయి గూడెం గ్రామానికి చెందిన సతీష్ అనే విలేకర్ ఓ ఛానల్లో పనిచేస్తున్నాడు.అయితే ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయములో గుర్తు తెలియని దుండుగలు పార్కింగ్ లో ఉన్న కారు వెనుక అద్దం పగలగొట్టి ముందు హాల్ లో ఉన్న సామాన్లు చిందరవందర చేశారు.అల్లరిముకలు మరో మారు ఇలాంటి దౌర్జన్యానికి పాల్పడితే చట్ట రిత్యా చర్యలు తప్పవని మండిపడ్డారు. ఉన్నతప్పుల్ని ఎత్తిచూపే ఇలాంటివారి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సమాజాన్ని పక్క త్రోవ పట్టివడమే అని అన్నారు. దీనిపై సరైన ఎంక్వయిరీ జరిపి న్యాయం జరిగేట్టు చూడాలన్నారు. హౌస్ ఆఫీసర్ స్పందించి ఎంక్వయిరీ చేపట్టామని త్వరలోనే పట్టుకొని చట్టరీత్య శిక్షిస్తామని సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. మండల ప్రెస్ క్లబ్ కమిటీ స్పందించి నిందితుల్ని ఎలాగైనా గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు.







# తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నిక

**నడిగూడెంవిశాలభారతి:**తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షులుగా దొంతగాని శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా పల్లపు నాగేశ్వరరావు లను నూతనంగా ఎన్నిక చేసినట్లు నల్లగొండ పార్లమెంటరీ అధ్యక్షులు కసిరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కోదాడ నియోజకవర్గం ఇంచార్జ్ ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన మండల తెలుగుదేశం పార్టీ సర్వ సభ్య సమావేశంలో మండల నూతన కమిటీని కార్యకర్తలు అభిప్రాయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. మండలంలో పార్టీ పటిష్టతకు నూతన కమిటీ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్తినేని సైదేశ్వర రావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి భయ్యా నారాయణ, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కొల్లు నర్సయ్య చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు సాతులూరి గురవయ్య మునగాల మండల పార్టీ అధ్యక్షులు నాదెండ్ల గోపాలరావు రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అమరవరపు శ్రీమన్నారాయణ గుండు నాగేశ్వరరావు కొల్లు గణేష్ థామస్ రఫీ నరసయ్య సీతయ్య వీరన్న పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ సాధన సంకల్ప
# రథయాత్రను విజయవంతం చేయండి

- టిఎస్ సిపిఎస్ ఈ యు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు.
- గుణగంటి నరసింహారావు.

**నడిగూడెంవిశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టిఎస్ సిపిఎస్ ఈ యు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుణగంటి నరసింహారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ సిపిఎస్ రద్దె ఏకైక లక్ష్యంతో జూలై 16 నుండి 31 వరకు టి ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర భాద్యులు స్నితప్రజ్ఞ శ్రీకాంత్, నరేష్ గౌడ్ , ఆధ్వర్యంలో చేపడుతున్న సంకల్ప రథయాత్ర ను సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు,సంఘ భాద్యులు అధిక సంఖ్యలో పాల్గొనలన్నారు.

2004 సెప్టెంబర్ ఒకటి నుండి ఉద్యోగంలో చేరిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ బలవంతంగా ఈ సిపిఎస్ విధానంలోకి నెట్టబడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రెండు లక్షల ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ సిపిఎస్ విధానంలో ఉన్నారు. సీపీస్ / పి యఫ్ ఆర్ డి ఏ చట్టం ప్రకారం ఉద్యోగుల సొంత వేతనం నుండి నెల నెల 10 శాతం జీతం కట్ చేసుకుని షేర్ మార్కెట్లో పెడతారు.ఈ షేర్ మార్కెట్ ఒడిదుడుకుల ద్వారా వచ్చిన డబ్బులు మాత్రమే ఉద్యోగి ఇవ్వబడుతుంది. రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగికి ఆసరా పెన్షన్ 2000 రూపాయలు కంటే ఘోరమైన తక్కువ పెన్షన్ ని పొందుతున్నారు. పాత పెన్షన్ విధానంలో ఉన్నటువంటి హెల్త్ కార్డు సదుపాయం, పి ఆర్ సి , డి ఏ పెరుగుదల ఎన్నో ప్రయోజనాలు సీపీస్ విధానంలో లేవు..ఈ మధ్యకాలం లో భారతదేశంలో నాలుగైదు రాష్ట్రాలు సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దించాయి.గత నాలుగైదు సంవత్సరాలలో టి ఎస్ సి పి ఎస్ ఈ యు ఆధ్వర్యంలో హైదరాబాదు, నిర్మల్ గజ్వేల్, లో లక్ష మంది ఉపాధ్యాయుల ఉద్యోగులతో జన జాతర, ఆయుధ ధర్మదీక్ష, జన గర్జన తెలంగాణ రాష్ట్రంలో అన్ని మండలాలలో జిల్లాలలో నిరసన దీక్షలు చేపట్టడం ద్వారా గ్రాడ్యుటీ ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని అలాగే ఇప్పుడు కూడా ఈ 33 జిల్లాల సంకల్ప రథయాత్ర ద్వారా పాత



పెన్షన్ సాధించుకుంటామని తెలిపారు. రథయాత్ర ఈనెల 18న జిల్లాలో చేరుకొని నేరేడుచర్ల, సూర్యపేట పట్టణం కోదాడలో బైక్ ర్యాలీ లో పెద్ద ఎత్తున ఉద్యోగులు ఉపాధ్యాయులు అందరూ హాజరై మన ఐక్యతను చాటి సిపి ఎస్ సాధన లో ముందు ఉండాలని కోరారు.



# సీహెచ్ సీలో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య**

**జఫర్ గడ్విశాలభారతి;** మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని విభాగాలకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు.మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట స్పెషలిస్ట్ డాక్టర్ నియమించాలని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్లో ప్రజలకు అనేక వ్యాధుల బారినప్పుడే అవకాశం ఉందన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది ,డాక్టర్లు లేకపోవడంతో పేద ప్రజలు కార్పొరే ట్ ఆస్పత్రులకు వెళ్లడం జరుగుతుంది. గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ ఎమ్లను,స్టాఫ్ నర్సులను నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలియజేశారు. ప్రతి విభాగానికి సంబంధించిన ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్,ప్రజలకు అవసరపడే ప్రతి డాక్టర్లను వెంటనే నియమించాలని లేనిపక్షంలో పది రోజుల వరకు వేచి చూసి జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఓ ఆఫీసును పెద్ద ఎత్తున ముట్ట డిస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు మాటలే తప్ప,ప్రజల ఆరోగ్యం పై సిద్ధ శుద్ధి లేదన్నారు.సామాజిక ఆరోగ్య కేంద్రం కార్పొరేట్ స్థాయిలో భవనం కనబడడం తప్ప అందులో ప్రజలకు ఉపయోగపడే డాక్టర్ లేరని తెలియజేశారు.వెంటనే డాక్టర్లను నియమించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎండి షబానా,కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వడ్ల కొండ సుధకర్, వెంకటమ్మ,సిద్ధం సోమన్న, జిల్లెల్ల శ్రీనివాస్,నీరెడ్డి కొమురయ్య,వడ్లకొండ రాజు, శంషొద్దీన్,వేల్పుల రవి, గుండె బోయిన రోజా,రాపర్తి ఊర్మిళ ,ఎర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

# పినపాటి రజనీకి బంగారు నంది పురస్కారం

- వల్లూరి గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో అందజేత
- బంగారు నంది ప్రశంసా పత్రంతో సత్కారం




బంగారు నంది పురస్కారంతో సత్కరిస్తున్న కోదండరాం, దామోదర్ కోలేటి,వల్లూరి గ్రూప్ సంస్థ ప్రతినిధులు

**శేరిలింగంపల్లివిశాలభారతి:** శేరిలింగంపల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకురాలు పినపాటి రజనీకి బంగారు నంది పురస్కారం వరించింది. జిసిఎస్ వల్లూరి గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో అత్యంత అరుదైన పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాన్ని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజనీకి ఈ అవార్డును బహూకరించారు. జిసిఎస్ వల్లూరి గ్రూపు సంస్థ నేషనల్ చైర్మన్ అండ్ ఫౌండర్ వి ఆర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ (టిఎస్ పిహెచ్ సిఎల్ )దామోదర్ కోలేటి, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేషనల్ చైర్మన్ మిరియం లియోన్ బాబు, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు మొగుళ్ళపల్లి ఉపేందర్,తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం,దయానంద శర్మ, నిత్య నిర్మలానంద యోగేశ్వర స్వామి, హైల్ టాటా మనీ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఫౌండర్ లోర్డు జ్యోతి లు ముఖ్యఅతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినపాటి రజని సమాజం పట్ల చూపిస్తున్న ప్రేమ ఆప్యాయతను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. పేదలు, అభాగ్యుల పట్ల ఆమె చూపిస్తున్న ప్రేమ,ఆప్యాయత, సేవా తత్పరత అమోఘమని కొనియాగారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి మరికొందరికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. పినపాటి రజని ఎందరికో ఆదర్శంగా నిలిచారని ఆమె తన సామాజిక సేవాను తన వంతు బాధ్యతగా భావించి నిర్వర్తిస్తుండడం గొప్ప విషయం అన్నారు.అనంతరం పినపాటి రజని మాట్లాడుతూ తనకి సామాజిక సేవ అంటే ఎంతో మక్కువ అని మీ సేవలను నిరంతరం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ బంగారు నంది,ప్రశంసా పత్రం పురస్కారాన్ని అందుకోవడంతో తనకు బాధ్యతను మరింత రెట్టింపు చేసిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# నాగప్పగారి సుందర్రాజు సేవలు చిరస్మరణీయం

- దళిత సాహిత్యానికి ఆయన విశేష కృషి
- హెచ్ సి యు లో డీఎస్ యూ విద్యార్థి నేతలు శ్రద్ధాంజలి



**శేరిలింగంపల్లివిశాలభారతి:** ప్రముఖ రచయత,ఉద్యమ కారుడు డా.నాగప్పగారి సుందర్రాజు దళిత సాహిత్యానికి చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ సుందర్రాజు 23వ వర్ధంతి సందర్భంగా దళిత విద్యార్థి సంఘం (డి.యస్.యు) హెచ్ సియు వారు ఘన నివాళి అర్పించారు.సుందర్రాజు చిన్న వయసులోనే చనిపోవడం తెలుగు సాహిత్యానికి తీరని లోటని అన్నారు.సెంట్రల్ యూనివర్సిటీలో ఆయన చేసిన ఉద్యమాలు నేటికీ ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో నాగప్పగారి సుందరరాజు దళిత సాహిత్య వేదిక,మాదిగ సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారని,దాని ద్వారా తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ధోరణికి ఆద్యుడుగా నిలిచారని వ్యాఖ్యానించారు. ఆయన సంపాదకత్వంలో వెలువడిన మాదిగ చైతన్యం కవితా సంకల్పం కిందివర్గాలలో గొప్ప ఆశను కలిగించిందని అన్నారు.అలాగే ఆయన రాసిన మాదిగోడు కథలు తెలుగు సాహిత్యంలో మాండలిక భాషకు ,ప్రాదేశిక చైతన్యానికి చిరునామాగా మారిందని పేర్కొన్నారు. తులనాత్మక అధ్యయన కేంద్రం అధ్యక్షులు ఆచార్య భీమయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సుందర్ రాజుకు విశేషమైన స్థానం ఉందని అన్నారు.ఆయన కథలు ఆయన సాహిత్యం వివిధ భాషల్లోకి అనువాదం అయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు.నాగప్పగారి సుందర్రాజు సాహిత్యం గురించి తెలియజేస్తూ దళిత ఔన్నత్యం కోసం పోరాడిన వ్యక్తి అని,విశ్వవిద్యాలయాలలో విద్యార్థి ఉద్యమాలకు బాటలు వేసి, దళిత విద్యార్థి రాజకీయాలకు కొత్త అర్థం చెప్పిన సామాజిక ఉద్యమకారుడు అని దళిత విద్యార్థి సంఘం అధ్యక్షులు వేణు వివరించారు. మాదిగ జీవితాలను, మాదిగల సాంస్కృతిక జీవితాలను అక్షరీకరించిన రచయిత డా. సుందర్రాజు అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.యూ అధ్యక్షులు వేణు,కన్వీనర్ కుమార్ రాజ,సిలపాక వెంకటాద్రి,కమలాకర్, రాణాప్రతాప్,చరణ్,సందీప్, విద్యార్థి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా
# కలిసిన గుండాల ఎంపీటీసీ

**- గొంగడి వెంకటరామిరెడ్డి**

**భద్రాచలంవిశాలభారతి:**ఎట్రపాక మండలంలోని మండల ప్రజాపరిషత్తులో ఎంపీడీవో గా పనిచేస్తున్న విటల్ పాల్ ప్రస్తుతం మెడికల్ లీవ్ లో ఉండగా, కూనవరం ఎంపీడీవో గా చేస్తున్న E. ప్రేమ్ సాగర్ కి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి నూతన ఎంపీడీవో ని పుష్ప గుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని పలు సమస్యల మీద చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుండాలఎంపీటీసీ



గొంగడి వెంకటరామిరెడ్డి, బారెడ్డి నరేందర్ రెడ్డి, పాల్గొన్నారు.



# మెడికల్ కళాశాల,ఎస్ టి పి ప్లాంట్లను సందర్శించిన మంత్రి జగదీష్ రెడ్డి

- **ఈ నెల 24 న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న నూతన భవనాలు**

**సూర్యాపేటవిశాలభారతి:** ఈ నెల 24న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న మెడికల్ కళాశాల నూతన భవనం తో పాటు ఎస్ టిపి ప్లాంట్ ను సోమవారం ఉదయం రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సందర్శించారు. అదే రోజు ప్రారంభించనున్న బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. మంత్రి జగదీష్ రెడ్డి వెంట రాజ్యసభ సభ్యులు, బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.





# జనగామ జిల్లాలో విశ్వరూప మహాసభ

- **ఈనెల 21న జనగామ జిల్లాలో విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం విజయవంతం చేయాలి.**
- **జేరిపోతుల సుధాకర్ మాదిగ**
- **పాలకుర్తి మండల ఇంచార్జ్**

**పాలకుర్తి విశాలభారతి:**పాలకుర్తి మండల కేంద్రంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు చెరుపల్లి యాదగిరి స్వామి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మహాజన సోషలిస్టు పార్టీ పాలకుర్తి మండల ఇన్చార్జి జేరిపోతుల సుధాకర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ" మాదిగ మాదిగ ఉపకులాల 29 సంవత్సరాలుగా ఎస్సీలను ఏబిసిడిలుగా వర్గీకరించాలని మహా జననేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ జాతి బిడ్డలు పోరాటం చేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే మాదిగ జాతి అంతిమ లక్ష్యమైన ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ సాధన కొరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అదేవిధంగా ప్రతిపక్ష పార్టీల మౌనాన్ని ప్రశ్నించేందుకు ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ నడిబొట్టిన మాదిగల విశ్వరూప మహాసభ జరగనుంది అట్టి సభ విజయవంతం కొరకు ఈనెల 21న జనగామ జిల్లా కేంద్రంలో జరుగు జిల్లా సన్నాక సమావేశానికి మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఏబిసిడి సాధన కొరకై జరుగు సమావేశానికి జనగామ జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా పాలకుర్తి మండల వివిధ గ్రామాల ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల మండల గ్రామ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు జలగం నరేష్ మాదిగ, గ్యార వెంకన్న మాదిగ, సాయిలు మాదిగ, ఎల్లయ్య మాదిగ, మల్లయ్య మాదిగ, రాజు మాదిగ, రవీందర్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన కుక్కల మోహన్

**ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో చేరిక**



**చిట్యాలవిశాలభారతి:**బీఆర్ఎస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కుక్కల నవనీత మోహన్ ఆయనతో పాటు 200 మంది కార్యకర్తలు నకిరేకల్ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరడం జరిగింది. అనంతరము కుక్కల మోహన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు నా వంతు కృషి చేసి చిరుమర్తి లింగయ్య ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. పార్టీలో చేరిన వారిలో గ్యార ఇస్తారి, అమరోజు మధుసూదన్, కుక్కల శ్రీను పిడుగు శ్రీకాంత్ రెడ్డి కడారి సత్యనారాయణ భాకి కుక్కల శ్రీను తదితరులు పార్టీలో చేరారు.ఈ కార్యక్రమం లో బిఅర్ఏస్ మండల పార్టీ అధ్యక్షులు ఆవుల అయిలయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మెండే సైదులు,కౌన్సిలర్ లు జిట్టా పద్మ బొందయ్య, కోనేటి క్రిష్ణ,బెల్లి సత్తయ్య, పట్టణ అధ్యక్షులు పొన్నం లక్ష్మయ్య,పట్టణ కార్యదర్శి జిట్టా చంద్రకాంత్, చిట్యాల లారీ అసోసియేషన్ అధ్యక్షులు జిగిని బిక్షంరెడ్డి ,సిలివేరు శేఖర్, దాసరి నరసింహ చిత్రగంటి ప్రవీణ్,యాకరి నరేందర్, గోలి భాస్కర్,చిత్రగట్టి నాగరాజు , యాసిన్, పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారం కొరకై చలో కలెక్టరేట్



**చిట్యాలవిశాలభారతి:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకై చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత 12 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా సమ్మె చేస్తున్న కార్మికులకు పోటీగా ఇతర కార్మికులను తీసుకువచ్చి పనిచేస్తున్నారని అన్నారు. ప్రపంచం మొత్తం దేశం మొత్తం కరోనాతో ప్రజలు ప్రాణాల అరచేతుల పెట్టుకుని నిత్యం క్షణక్షణం అనుక్షణం ప్రాణాల అరచేతులో పెట్టుకున్న పరిస్థితులలో గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలలో శానిటేషన్ పనులు మురికి కాలువలు బీజింగ్ పౌడర్ స్ప్రే కరోనా వచ్చిన పేషెంట్ల ఇండ్ల దగ్గర వీధులలో స్ప్రెడ్ కాకుండా కరోనాతో యుద్ధం చేసి కరోనాని కంట్రోల్ చేసిన గ్రామపంచాయతీ కార్మికులను దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేవుళ్లతో సమానంగా పోల్చిన కార్మికుల యొక్క సమస్యలను డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దళిత ఎమ్మెల్యేగా ఉండి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న దళిత ఎస్సీ ఎస్టీ బీసీ పేద ఓసి కులాలకు చెందిన గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా చేస్తున్న కనీసం పట్టించుకోకపోవడంతో మంగళవారం నాడు నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి చేయడానికి పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వలిగొండ లింగయ్య, మహంకాళి బాలమ్మ, మల్లమ్మ, యాదయ్య, బిక్షం, గణేషు, రాములు, యాదయ్య, స్వామి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి

- **కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రైతాంగం**
- **వ్యవసాయాన్ని దండుగ చేసిన పాపం కాంగ్రెస్ దే**
- **ఉచితం విద్యుత్ పై రేవంత్ వ్యాఖ్యలు విడ్డూరం**



**పాలకుర్తివిశాలభారతి:** గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ అసమర్థ దుష్ట పాలన వల్ల రైతులు అరిగోస పడ్డారు. అందుకే ఆ పార్టీకి ప్రజలు చరమగీతం పాడారు.రేవంత్ రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంటు చాలట. ఒక గంట కరెంటుతో ఒక ఎకరం పారించవచ్చట. వ్యవసాయం గురించి తెలిసినోడు మాట్లాడే మాటలేనా? కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలతో రైతులు నవ్వుకుంటున్నారు. నవ్వులపాలైన ఆ పార్టీని పాతాళంలో పాతిపెట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ వైఖరి ని నిరసిస్తూ, జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం, పాలకుర్తి మండలం, ముత్తారం, పాలకుర్తి రైతు వేదికల వద్ద రైతులతో కలిసి నిర్వహించిన సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కాంగ్రెస్ వ్యాఖ్యలపై కన్నెర్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మూర్ఖంగా మాట్లాడుతున్నది. తప్పుడు ప్రచారాలు చేస్తున్నది. ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నది. దున్నపోతు ఈనింది అంటే.. దొడ్లో కట్టేయమన్నట్లే ఉంది. వ్యవసాయాన్ని దండుగ చేసిన పాపం కాంగ్రెస్ దే అత్యధికంగా ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన పాపమే కదా. ఈ రోజు ఈ లోపాలకు కారణం. రైతులు కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డారు. సాగునీరు అందక, ప్రాజెక్టులు లేక, భూ గర్భ జలాలు అడుగంటి, తాగునీటికి కూడా తల్లడిల్లారు. కరెంటు కష్టాలు, కోతలతో, పవర్ హాలీడేలతో తల్లడిల్లినం. అని మంత్రి ఎర్రబెల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హయాంలో కాలిపోయే మోటార్లు, స్టార్టర్లు, ఎండిపోయిన పైర్లు అసెంబ్లీలో ప్రదర్శించి, అల్లరి చేసే పరిస్థితి నాడు ఉండేది. వాటితోనే అసెంబ్లీ దద్దరిల్లేది. వ్యవసాయం దండుగ అనేది. ఎరువులు, విత్తనాల కొరత, నకిలీలు, సాగునీరు లేక, కరెంట్ రాక అంతా ఆగమాగం ఉండేది. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుర్మార్గ పాలన అనాడు సాగింది. ఎండాకాలంలో గ్రామాలకు రావాలంటేనే ప్రజాప్రతినిధులు భయపడేవారు అని ఆనాటి పరిస్థితులను మంత్రి రైతులకు వివరించారు. అందుకే 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడారు.ఆ పార్టీని ప్రజలు పాతాళానికి తొక్కినా బుద్ధిరాలేదు. అవగాహన లేని నాయకత్వం, ప్రజలను అయోమయానికి గురి చేసే విధంగా చేస్తున్న వ్యాఖ్యలు చూస్తే, ఆ పార్టీ పని అయిపోయిందని తేలిపోతున్నదని మంత్రి ఎర్రబెల్లి వివరించారు.

సిఎం కెసిఆర్ వ్యవసాయాన్ని పండుగ చేశారు ఇదే దశలో సీఎం కెసిఆర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి, కాళేశ్వరం వంటి ప్రపంచంలోనే అతి గొప్ప ప్రాజెక్టులు కట్టి, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. సాగునీరు పుష్కలంగా లభిస్తున్నదని, కోతలు లేని, నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా వస్తున్నదని, దీంతో పంటలుబాగా పండి, రైతులు సంతోషంగా ఉన్నారని, రైతుల పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రాష్ట్రంలో రైతును రాజును చేసిన ఘనత సీఎం కెసిఆర్ కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల రైతు సమితి నాయకులు రైతు కోఆర్డినేటర్లు,పార్టీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు రైతులు, ప్రత్యేకించి మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అమావాస్య సందర్భంగా సోమేశ్వరుడికి ఘనంగా అభిషేకాలు

**అడవిదేవులపల్లి విశాలభారతి:**అడవిదేవులపల్లి మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామి వారికి పంచామృత రుద్రాభిషేకాలు విశిష్టటం గా జరిగాయి. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి మంగళ హారతులు ఇవ్వడం జరిగింది, పూజలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదలు స్వీకరించారు.అమావాస్య రోజున శివుడికి రుద్రాభిషేకము ఎంతో విశిష్టం కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రామ్మోహన్ శర్మ పాల్గొన్నారు.



# యాదవ యుద్ధ భేరీ సభ గోడ పత్రిక ఆవిష్కరణ

- **ఆగస్టు 13న హైదరాబాదులో జరిగే యాదవ యుద్ధభేరి సదస్సులు విజయవంతం చేయాలి**
- **యాదవులు ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఐకమత్యంతో కలిసి పని చేయాలి**
- **డిసిఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్**

**సూర్యాపేటవిశాలభారతి:** ఆగస్టు 13న హైదరాబాద్ లో జరిగే యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జరిగే యాదవ యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్,యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ఎన్ గార్డెన్ లో యాదవ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్నాహాక సమావేశంలో యుద్ధ భేరీ సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు అవుతున్నా తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణాలే పరిపాలిస్తున్నాయని,తొంభై శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కడం లేదని తెలిపారు. యాదవులు ఐక్యంగా ఉంటూనే తమ సమస్యల పరిష్కారం కొరకు పోరాడాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 18% జనాభా వున్న యాదవులకు రాష్ట్రంలో అన్ని పార్టీలు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలు 22, పార్లమెంట్ స్థానాలు ఐదు, రాజ్యసభ రెండు, ఎమ్మెల్సీ స్థానాలు 7 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేమెంత ఉన్నామో మాకు అంత వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవులకు టిక్కెట్ లు ఇచ్చే రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని అన్నారు. యాదవులు ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఐకమత్యంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తండు శ్రీనివాస్ యాదవ్, మక్కల వెంకన్న, ఊర గాయత్రి, మతకాల చలపతిరావు, వీరస్వామి,మాంద్ర మల్లయ్య, రాజు యాదవ్,ఓయి విద్యార్థి ఐకాస చైర్మన్ జటంగి సురేష్, జనార్ధన్ యాదవ్, మర్యాద సైదులు, తోట శ్రీనివాస్ యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్, శ్రీకాంత్, నాగరాజు, వాసు, శ్రీశైలం, పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సెక్యూరిటీ ఏర్పాట్లు పరిశీలన

- **ప్రణాళిక ప్రకారం భద్రతా చర్యలు తీసుకోవాలి**
- **అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి**
- **జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఐపిఎస్**

సూర్యపేటవిశాలభారతి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సూర్యాపేట జిల్లా పర్యటన, నూతన కార్యాలయాల ప్రారంభోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పోలీసు అధికారులతో కలిసి ముందస్తుగా సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిపాడ్, నూతన కలక్టర్ కార్యాలయ భవనం, ఎస్పీ కార్యాలయ భవనం, వైద్య కళాశాల, మార్కెట్ యార్డ్, సభా ప్రాంగణం మొదలగు వాటి వద్ద సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గం ను పరిశీలించారు. సెక్యూరిటీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక ప్రకారం భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి లోపాలకు అవకాశం ఇవ్వొద్దు అన్నారు. జిల్లా యంత్రాంగం, ఇతర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డి.ఎస్.పి లు నాగభూషణం, వెంకటేశ్వర రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి శ్రీనివాస్, సిఐలు, ఎస్సై లు ,మరియు సిబ్బంది ఉన్నారు.





# తుర్కయంజాల్‌లో కాంగ్రెస్‌కు షాక్

- **-బీఆర్ఎస్‌లోకి పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు చేరిక**
- **- మల్‌రెడ్డి బ్రదర్స్ తీరు నచ్చక పార్టీ మారుతున్నట్లు వెల్లడి**

**తుర్కయంజాల్‌విశాలభారతి:**తుర్కయంజాల్‌లో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన సుమారు 10మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ మెంబర్లు పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. మల్‌రెడ్డి బ్రదర్స్ వ్యవహరిస్తున్న తీరుతో విసుగుచెంది పార్టీ మారుతున్నట్లు చెబుతున్నారు. ఒప్పందంలో భాగంగా చైర్ పర్సన్ పదవిని రొక్కం వర్గానికి మల్‌రెడ్డి బ్రదర్స్ ఇవ్వకపోడంతో వివాదం రాజుకుంది. సుమారు ఏడాదిన్నరగా మల్‌రెడ్డి బ్రదర్స్‌ను పదవి ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని రొక్కం వర్గం ఆగ్రహంతో ఉన్నారు. తాజాగా చైర్ పర్సన్ పదవిని వదులుకోబోమని మల్‌రెడ్డి బ్రదర్స్ తేటతెల్లం చేయడంతో చేసేది లేక రొక్కం వర్గం పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. సోమవారం రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభీష్టం మేరకు పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. తన వర్గం నాయకులతో కలిసి రొక్కం భీంరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నరగా మల్‌రెడ్డి బ్రదర్స్ తమను ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్‌రెడ్డి రంగారెడ్డిపై తమకు ఎప్పుడూ నమ్మకం లేదని... భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభ్యర్థన మేరకు ఆనాడు కాంగ్రెస్‌లో చేరామన్నారు. అప్పుడు చేసుకున్న ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల కాల పరిమితి ముగిసిన వెంటనే తమకు ఇవ్వాల్సిన చైర్ పర్సన్ పదవిని ఇవ్వకుండా ఊగిసలాడారని భీంరెడ్డి విమర్శించారు. ఒకసారి ఆరు నెలల తర్వాత మాట్లాడదామని, మరోసారి రెండునెలల తర్వాత అంటూ ఏడాదిన్నరగా పదవిని వదుకోలేకపోతున్నారని ఆరోపించారు. చైర్ పర్సన్ పదవి విషయమై కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. చివరకు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మల్‌రెడ్డి బ్రదర్స్ మాటపై నిలబడే వ్యక్తులు కాదని... కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. చైర్ పర్సన్ రాజీనామా లెటర్‌ను కలెక్టర్‌కు ఇచ్చి తర్వాత రోజు వెళ్లి లెటర్‌ను మళ్లీ వెనక్కి తెచ్చుకున్నారని విమర్శించారు. మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు కౌన్సిలర్లకు నిధులు ఇవ్వకుండా వివక్ష చూపారని ఆరోపించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి వైఖరితో ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ దిగజారుతోందని దుయ్యబట్టారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలలో పార్టీకి కార్యవర్గమే లేదన్నారు. మల్‌రెడ్డి బ్రదర్స్ మోసపూరిత వైఖరి, వ్యవహారశైలి నచ్చక పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. 19వ తేదీన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి ఏ పార్టీలో చేరేది నిర్ణయిస్తామన్నారు.

కాగా... రొక్కం భీంరెడ్డి, ఆయన వర్గంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈనెల 19న తన అనుచరులతో కలిసి భీంరెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం లాంఛనమేనని భావిస్తున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని 10మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ మెంబర్లు సహా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వ్యాప్తంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు టీడీపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరబోతున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు బొక్క రవీందర్‌రెడ్డి, కొంద్రు మల్లేశ్, కో ఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, నారని శేఖర్‌గౌడ్, జక్క రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి దళితుడికి దళితబంధు అమలు చేయాలి

**కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి గోపగాని హనుమంతు డిమాండ్**



**అడవిదేవులపల్లి విశాలభారతి:** దళిత బందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి దళిత బహుజన కుటుంబానికి వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి గోపగాని హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉన్న ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో నియోజకవర్గ పరిధిలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని జోస్యం చెప్పుకొచ్చారు.




# ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**గ్రామపంచాయతీ కార్మికులు హెచ్చరిక**

**శాలిగౌరారంవిశాలభారతి:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా శాలిగౌరారం మండల కేంద్రంలోని 12వ రోజు గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో కమిటీ సభ్యుల మండల అధ్యక్షులు చెర్లపల్లి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు వడ్లకొండ నగేష్ కార్యదర్శి షర్టు వెంకన్న కోశాధికారి మద్ది మల్లేష్ జిల్లా అధ్యక్షులు గోని గంగారం మందుల సాయిలు మాట్లాడుతూ 12 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులను చర్చలకు పిలవాలని లేనియెడల పెద్ద ఎత్తున పోరాట రూపాన్ని తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో కార్మికులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడతాయని అన్నారు. గ్రామాలలో వెట్టి చాకిరి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాన్ని అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు గ్రామపంచాయతీ కార్మికులు మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు బెనిఫిట్స్ అందే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని గ్రామపంచాయతీ కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు సైదులు పాపయ్య లింగస్వామి వెంకన్న అంజయ్య నరసింహ రాములు తదితరులు పాల్గొన్నారు.






# అంజన్నకు అందుతున్న ప్రజా ఆదరణ

- 4 వ రోజుకు చేరిన గడప పడపకు అంజన్న యాత్ర
- ప్రజా సమస్యలు అడిగితే తెలుసుకుంటున్న వైనం
- మండల వ్యాప్తంగా అందుతున్న ఆదరణ
- అవకాశం ఇవ్వండి అండగా ఉంటా లేదంటే సాయం చేస్తానని హామీ

**అనంతగిరి విశాలభారతి:** ఈనెల 14న గడపగడపకు అంజి యాదవ్ అనే యాత్రను గొండ్రియాల గ్రామం నుండి మల్లెబోయిన అంజి యాదవ్ ప్రారంభించారు. యాత్రను నియోజకవర్గం నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా 4 వ రోజున మండల పరిధిలోని వెంకటరామపురం, కొత్త గోల్ తండా, పాత గోల్ తండా, మిటియా తండా, వాయిలసింగారం, వసంత పురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్రలో ప్రజా ఆధరణ అందుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తననీ గెలిపించాలని ప్రజా సమస్యలకు నిత్యం ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రతి ఇంటికి వెళుతున్న తనకు ఎన్నో సమస్యలు ప్రజల వివరించారని వాటినీ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. గద్దెనెక్కి ప్రజా సమస్యలను గాలికి వదిలేసే నాయకుడిని కాదని ప్రతి కుటుంబంలో సభ్యుడిగా ఉంటున్న వ్యక్తిని అన్నారు.పాలకులు, పాలన విధానం మారుతున్న కూడా ఇప్పటికీ నివసించడానికి సరైన ఇల్లు కూడా లేక కొన్ని గ్రామాల్లో ప్రజలు అవస్థలు పడుతున్న దృశ్యాన్ని చూసి చెల్లించిపోయానన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల అవకాశం ఇస్తే అవినీతి రాజకీయాలని రూపుమాపుతానని నూతన శకానికి నాంది పలికే విధంగా నడుచుకుంటానని అన్నారు. తాను పర్యటించిన ప్రతి గ్రామంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య గుర్తుంచుకుంటానని పరిష్కరించడానికి ప్రజల అవకాశం ఇస్తే న్యాయం చేసి నిరూపిస్తానని తెలిపారు. అవకాశం ఇస్తే అండగా అంటా లేదంటే సాయం చేస్తా అన్నారు . అనంతరం గత కొద్ది రోజులుగా పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా నిలిచారు. గ్రామ పారిశుధ్య విధానంలో పంచాయతీ కార్మికులే ప్రధానంగా ఉన్నారని వారు నిర్వహిస్తున్న సమ్మె న్యాయబద్ధంగానే ఉందని వారికి ప్రభుత్వం వెంటనే జీవితాలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరోనా సృష్టించిన కల్లోల సమయంలో కూడా ప్రతి గ్రామంలో పంచాయతీ కార్మికుల ముందుండి ప్రాణాలకు తెగించి గ్రామ పారిశుద్ధ్యనికి పాటుపడ్డారని గుర్తు చేశారు. అలాంటి పంచాయతీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి అండగా నిలవాలని కోరారు.




# గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

**ప్రియదర్శిని మేడి**

**కేతేపల్లివిశాలభారతి:** గ్రామ పంచాయతీ కార్మికులందరిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని బిఎస్పి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేతేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న పరిశుద్ధ కార్మికులకు మద్దతు తెలిపారు.అనంతరం ప్రియదర్శిని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యాబైవేల మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు బిల్ కలెక్టర్లు వివిధ కేటగిరిలో పనిచేస్తున్నా పనికితగ్గ వేతనాలు రావడం లేదన్నారు.గ్రామపంచాయతీ సిబ్బందికి కేటగిరి వారిగా వేతనాలు నిర్వహించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.51 తీసుకొచ్చి మల్టీ పర్పస్ విధానాన్ని అమలుచేస్తుంది. గ్రామంలో చెత్త చెదారం,జంతు కలేభరాలు ,కుళ్ళిపోయిన శవాలను తొలగిస్తూ మురికి కాల్వలను శుభ్రం చేస్తూ జీవితాంతం వెట్టి చాకిరి చేయాల్సివస్తుంది. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులందరికీ కనీస వేతనం 20వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేసి, ఆరోగ్యభద్రత కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేతేపల్లి మండల అధ్యక్షులు ఎడ్ల విజయ్, సునీత,వంటపాక సుదర్శన్, సూరారపు నవీన్,వంటేపాక శివ,రాజు పారిశుద్ధ కార్మికులు సైదులు, తానేష్,కేశవులు, దిలీప్, గుర్వమ్మ, నరేందర్, జానయ్య, వెంకటేష్, వెంకటయ్య లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# సత్యసాయి సేవా సమితి అధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

చిట్యాలవిశాలభారతి: చిట్యాల మున్సిపాలిటీలోని 9వ వార్డులో బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న సామ పద్మమ్మకి మరియు ఎండి యాకుబ్ బి కాలు విరగి చికిత్స తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని కౌన్సిలర్ బెల్లి సత్తయ్య ద్వారా విషయం తెలుసుకున్న సత్యసాయి సేవా సంస్థ భజన మండలి చిట్యాల వారి సౌజన్యంతో నిత్యవసర సరుకులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భజన మండలి భక్తులు మేడిశెట్టి ఝాన్సీ జ్యోతి, మేడిశెట్టి అంజయ్య, సరుకులను అందజేయడం జరిగింది. కౌన్సిలర్ బెల్లి సత్తయ్య సత్యసాయి సేవా సమితి వారికి కృతజ్ఞతలు తెలిపారు.




# పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం స్పందించాలి

**అనంతగిరి విశాలభారతి:** పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్షత చూపడం సరికాదని జనసేన మండల పార్టీ అధ్యక్షులు రేపాకుల నరేష్ అన్నారు. గత కొద్ది రోజులుగా జీతాలు పెంచాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుద్ధ కార్మికులే శ్రమించాలని. కరోనా విపత్తు సమయంలో కూడా వారు చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ప్రతి డిపార్ట్మెంట్ కు జీతాలు పెంచారనీ కానీ పంచాయతీ కార్మికులు పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని. వారి కోరినట్లుగా జీతాలు పెంచి వారి కుటుంబాలకు ప్రభుత్వమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు. సమయభావన లేకుండ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరంతరం గ్రామానికి సేవలందిస్తున్న వారి సమస్యను ప్రభుత్వం గాలికి వదిలేయడం విచారమని అన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ జీవిస్తున్న వారిని ఇలా రోజుల తరబడి రోడ్లపై బైఠాయింప చేసే విధంగా ప్రభుత్వం నడుచుకోవడం సమంజసం కాదని ప్రభుత్వం ఇప్పటికైనా పంచాయతీ కార్మికుల సమస్యను తీర్చి వారి జీతాలు పెంచి కుటుంబాలను ఆదుకునే విధంగా దోహదపడాలని ఆయన కోరారు. మండల వ్యాప్తంగా ఉన్న 65 మంది పంచాయతీ కార్మికులు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయంపై ప్రభుత్వం ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోందనీ అన్నారు. పంచాయతీ కార్మికులకు అనంతరం భోజన వసతి కల్పించి వారికి అండగుంటామని వారి సమస్యపై ప్రశ్నించడానికి వారితోపాటు ముందుకు నడుస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తోట నవీన్ ,మండల ఉపాధ్యక్షలు కొప్పుల నవీన్, మండల జనరల్ సెక్రటరీ , కస్తూరి సురేష్ ,కోదాడ నియోజకవర్గ ఆర్గనైజర్, అంజి ,మునగాల మండల అధ్యక్షులు అంజి ,చిలుకూరు మండల అధ్యక్షులు, మహేష్ ,అనంతగిరి మండల ఆర్గనైజర్, మస్తాన్ ,మండల కమిటీ మెంబెర్లు, జనసైనికులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం బడిని కాపాడుకుందాం

**వంగూరి దామోదర్**

**నాగారంమండలం విశాలభారతి:** ప్రైవేట్ స్కూల్ బస్సులు గ్రామానికి రాకుండా అడ్డుకుందామని ,ఈటూర్ గ్రామ ప్రభుత్వ బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపైన ఉందని ఈటూరు గ్రామ వాసి టెక్నో డీడ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వంగూరి దామోదర్ అన్నారు.ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో దామోదర్ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు.ఈటూరు గ్రామం నుండి ప్రైవేట్ స్కూల్స్ కి పంపుతున్న పిల్లల తల్లిదండ్రులనీ కలిసి ప్రైవేట్ స్కూల్స్ చేస్తున్న విచ్చలవిడి విడి దందనీ,విద్య వ్యాపారాన్ని గురించి తల్లిదండ్రులకి అహగాహన కల్పించామన్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడికి గ్రామ పిల్లలని పంపించకుండా ప్రైవేట్ బడులకి పంపటం వల్ల పిల్లలు తగ్గిపోతే భవిష్యత్ లో మూతపడే అవకాశం కూడా ఉందని,ప్రైవేట్ బడులకీ పోయే పిల్లల మనస్తత్వం కూడా వ్యాపారం చేసే లాగా ఉంటుందని విలువలు నేర్పకుండ కేవలం ప్రతిధి పైసలకి ముడిపెట్టి ఒక వస్తువు లాగా విద్యార్థులు తయారు అయితరని , విలువలతో కూడిన విద్యా కేవలం ప్రభుత్వ బడిలోనే సాధ్యం కాబట్టి ఈటూరు గ్రామస్థులు అంత తమ పిల్లలని ఊరిలోని ఉన్న ప్రభుత్వ బడిలోకే పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరాల సరిత యాదగిరి, హైస్కూల్ ఇంచార్జి ప్రభాకర్,SMC చైర్మన్ కొత్తోజు ఏళ్ళ చారి,కవి గాయకులు పేరాల యాదగిరి,ప్రతిభ యూత్ అధ్యక్షులు బోడ పరశరాములు యువజన సంఘాల నాయకులు వంగూరి కుమార్, వంగూరి సందీప్,బొట్టు సురేష్,పేరాల రాజు ,వంగూరి అవిలమల్లు,బోడ కళ్యాణ్, బోడ దిలీప్,వంగూరి అంజయ్య,బోడ సురేష్,పేరాల అబ్బాస్,పేరాల గోపి,పేరాల అవిలయ్యా,పేరాల దయానంద్,పేరాల అంజయ్య,తదితరులు పాల్గొన్నారు..





# రైతులు కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోతే గోస పడతాం
- ఎంపి అరవింద్ మాటలు నమ్మే ఒకసారి మోస పోయాం
- అరవింద్ ఆరోపణలు అర్థరహితం,సిబిఐ లేదా దాని అయ్య దర్యాప్తు సంస్థలతో ఎంక్వైరీ చేసుకోవచ్చు
- వేల్పూర్ రైతు వేదిక వద్ద జరిగిన నిరసన సభలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండవిశాలభారతి:** రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలోని వేల్పూరు రైతు వేదిక వద్ద జరిగిన నిరసన సభలో రైతులతో కలిసి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తాము అధికారం లోకి వస్తే ఎం చేయబోతున్నరో చెప్పాడు.24గంటల ఉచిత కరెంట్ ఇస్తే కాంగ్రెస్ కు ఎం నష్టమని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్గఢ్ లో 8గంటల కరెంట్ మాత్రమే ఇస్తది.వాళ్లు మిగుల్చుకోని అమ్ముకుంటారు.అది మనమే కొంటున్నాం.అక్కడ కొని ఇక్కడ రైతులకు ఇస్తున్నామని చెప్పారు. జాతీయ పార్టీయైన కాంగ్రెస్ కి జాతీయ విధానం ఉండదా,కాంగ్రెస్ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రల్లో 24గంటల కరెంట్ ఇస్తారా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు.ఆర్టీఏ అప్లికేషన్లు పెట్టి బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెలిపారు. ఛత్తీస్ ఘడ్ నుండి కరెంట్ తెచ్చుకునేందుకు లైన్లు కూడా లేవు.60 సంవత్సరాల కాంగ్రెస్ లో కనీసం లైన్లు కూడా వేసుకోలేదని అన్నారు.4500 మెగావాట్ల ఉన్న తెలంగాణ 18వేలా మెగావాట్ల ఉత్పాదన ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 80వేలా కోట్లతో పూర్తయిన కాళేశ్వరానికి లక్ష కోట్ల అవినీతి జరిగింది అంటున్నారు.ఎంత సిగ్గు చేటు బీజేపీ నేతలది.బీజేపీ రైతుల మోటార్లకు మీటర్లు పెడతామని,కాంగ్రెస్ ఉచిత విద్యుత్ అవసరం లేదని మాట్లాడుతున్నారు.రైతులు ఆలోచన చేయాలి.మోస పోతే గోస పడతాం అని అన్నారు.

**ఎంపి అరవింద్ పై మంత్రి వేముల ఫైర్**

అరవింద్ పసుపు బోర్డు తేకపోతే రాజీనామా చేస్తానని చెప్పి మోసం చేసి ఎంపి ఐనోడు, రైతులను మోసం చేసి దర్జాగా తిరుగుతూ కష్టపడుతున్న మా లాంటి వాళ్లను ఇష్టం వచ్చినట్లు అచ్చోసిన ఆంబోతువలె ఒర్లుతున్నడని మంత్రి అన్నారు. నాలుగున్నరేళ్ల లో తప్పు చేయని ప్రశాంత్ రెడ్డి ఇప్పుడు చేస్తాడా,ఇప్పుడే ఎన్నికల ముందు ఎందుకు ఆరోపణలు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలని మంత్రి కోరారు.ఎంపీ కి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు.సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ కింద కేంద్రం 300 కోట్లు కేటాయించారు.దానిలో 70 కోట్లు బాల్కొండ నియోజకవర్గం రోడ్లకు, బ్రిడ్జికి కేటాయించుకున్నామని తెలిపారు.దాన్ని తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారు.సిబిఐ ఎంక్వేరి కాదు అంతకు మించి ఇంకేమైనా ఇంక్వైరి చేసుకోవచ్చు,అయినా మీరు పని చెసే వాళ్ళ మీదనే ఈడీలు, సిబిఐలు ప్రయోగిస్తారు. అదే మీ పని అంటూ అరవింద్ పై మంత్రి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు,రైతు బంధు సమితి సభ్యులు,రైతులు,బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# దండు మైసమ్మ తల్లిని వేడుకున్న గ్రామపంచాయతీ కార్మికులు

**నూతనకల్ విశాలభారతి:** కెసిఆర్ తన పాలన ముందుకు సాగడానికి యజ్ఞాలు, యాగాలు చేశారని కెసిఆర్ గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను పట్టించుకోకపోవడంతో దండుమైసమ్మ తల్లి కి తమ గోసా చెపుకున్నామని గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ మండల అధ్యక్షులు నగరి కంటి సంబయ్య అన్నారు. గత 12 రోజుల నుండి గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోపోవడంతో ఏ దిక్కులేని నూతనకల్ మండలం గ్రామపంచాయతీ కార్మికులు దండు మైసమ్మ తల్లి గుడి చుట్టూ తిరుగుతూ దండాలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి వేడుకొన్నారని అయిన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాపై కరుణించే విధంగా దండు మైసమ్మ తల్లి చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లను వెట్టిచాకిరి చేయించుకుంటూ, అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, కనీస వేతనాల చట్టం ను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికుల ఉద్యోగాలకు భద్రత లేదని, పి ఎఫ్, ఈ ఎస్ ఐ సౌకర్యం లేదని, ప్రమాదం భీమా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి మండల నాయకులు హరిబాబు, సందీప్ వెంకన్న, అచ్చిరెడ్డి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు





# జవాన్ పోస్టర్ విడుదల




నయనతారను ఇంతకు మునుపెప్పుడూ చూడని పవర్ ప్యాక్డ్ యాక్షన్ అవతార్‌లో చూడటానికి సిద్ధంకండి. ప్రేక్షకుల్లో రోజురోజుకీ ఘనంగా అంచనాలు క్రియేట్ చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ జవాన్. షారుఖ్‌ఖాన్ హీరోగా నటిస్తున్నారు. నానాటికీ జనాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది జవాన్ మూవీ. జవాన్ నుంచి నెక్స్ట్ ఎలాంటి అప్‌డేట్ వస్తుందా? అని ఆత్రుతతో ఎదురుచూస్తున్న అభిమానుల మనసు తెలుసుకున్న మేకర్స్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. చూడగానే స్టన్నింగ్‌గా, యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో మెప్పిస్తున్నారు నయనతార. జవాన్ హీరోయిన్ నయనతార లుక్‌కి అందరూ ఫిదా అవుతున్నారు. ప్రివ్యూలో ఆమె లుక్ చూసిన వాళ్లు సినిమాలో మరో రేంజ్‌లో ఉండి తీరుతుందని ఫిక్స్ అయ్యారు. ఈ పోస్టర్ వారి అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా డిజైన్ అయింది. షారుఖ్ ఇచ్చిన ట్రీట్ సూపర్‌డూపర్ అంటున్నారు ఫ్యాన్స్. సౌత్ ఇండియాలో తలైవిగా, లేడీ సూపర్‌స్టార్‌గా మెప్పించిన నయనతారకు బాలీవుడ్‌లో ఇది తొలి సినిమా. ప్రప్రథమంగా ఆమె ఉత్తరాదిన చేస్తున్న సినిమా కోసం అక్కడివారు కూడా ఎదురుచూస్తున్నారు. మొట్టమొదటి సారి వెండితెరమీద కలిసి నటిస్తున్నారు షారుఖ్ ఖాన్, నయనతార. వారిద్దరి మధ్య ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీని చూడటానికి వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు మూవీగోయర్స్.

# 'సైంధవ్' నుంచి గాయత్రిగా సారా పరిచయం

విక్టరీ వెంకటేష్ 75వ ల్యాండ్‌మార్క్ చిత్రంలో 'సైంధవ్'గా తన ఫెరోషియస్ షేడ్స్ ఇప్పటివరకు చూశాము. ఇప్పుడు అతని లోతైన భావోద్వేగాన్ని పరిచయం చేశారు. బేబీ సారా హార్ట్ ఆఫ్ సైంధవ్ అని రివిల్ చేశారు మేకర్స్. పోస్టర్ లో పాప వెంకటేష్ ను కౌగిలించుకోవడం చూడవచ్చు. పోస్టర్ లో వెంకటేష్ గాయాలతో కనిపిస్తున్నారు. సినిమాలో సారా పాత్ర పేరు గాయత్రి. 'HIT' ఫ్రాంచైజ్ తో వరుసవిజయాలు అందించిన సక్సెస్ ఫుల్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పై వెంకట్ బోయనపల్లి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సైంధవ్ హైఆక్టేన్ యాక్షన్ గా రూపొందుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. సారా పాత్ర హార్ట్ అఫ్ సైంధవ్. ఈ చిత్రంతో బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖ్ వికాస్ మాలిక్ క్యారెక్టర్ లో టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్ మనోజ్ఞ పాత్రలో కథానాయికగా నటిస్తుండగా, డాక్టర్ రేణుగా రుహాని శర్మ, జాస్మిన్ పాత్రలో ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలలో నటిస్తున్నారు. పాన్ ఇండియా మూవీ సైంధవ్ అన్ని దక్షిణాది భాషలు, హిందీలో డిసెంబర్ 22న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది.

# రెయిన్‌బో' తొలి షెడ్యూల్ పూర్తి

రష్మిక మందన ప్రధాన పాత్రలో రూపొందుతున్న తెలుగు తమిళ ద్విభాషా రోమాంటిక్ ఫాంటసీ ఎంటర్ టైనర్ 'రెయిన్‌బో. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాతలు ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. నూతన దర్శకుడు శాంతరూబన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం తొలి షెడ్యూల్ షూటింగ్ ని పూర్తి చేసుకుంది. కోడైకెనాల్ తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు. ఇప్పుడు 'రెయిన్‌బో' సెకండ్ షెడ్యూల్ షూటింగ్ కి సిద్ధమౌతోంది. త్వరలోనే సెకండ్ షెడ్యూల్ ప్రారంభమౌతుంది.



# దిల్ రాజ్ చేతుల మీదుగా 'నాతో నేను'ట్రైలర్ లాంచ్

సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్య, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రధారులుగా శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్ట్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న చిత్రం 'నాతో నేను'. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పాటలు శ్రోతలను అలరిస్తున్నారు. ఈ నెల 21న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను అగ్ర నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''నాతో నేను' ట్రైలర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. ట్రైలర్‌లో ట్రయాంగిల్ ఎమోషన్స్ చూపించారు. చాలా బావుంది. సాయికుమార్ నటన గురించి అందరికీ తెలిసిందే. ఆయనతోపాటు ఆర్టిస్టులు అద్భుతంగా నటించారు. టీమ్‌కి ఆల్ ద బెస్ట్'' అని అన్నారు. ''నాతో నేను' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొంది. ఇటీవల విడుదల చేసిన పాటలు అన్నింటికి చక్కని స్పందన వచ్చింది. ఈ నెల 21 ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం'' అని నిర్మాత ప్రశాంత్ టంగుటూరి తెలిపారు.



# పవన్ కళ్యాణ్ అనే ఒక్క పేరు చాలు

: కేతిక శర్మ

పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ కలయికలో పి. సముద్రఖని దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'బ్రో'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకి వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మాటలమాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ఇతర ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా జూలై 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో సాయి ధరమ్ తేజ్ సరసన నటించిన కథానాయిక కేతిక శర్మ తాజాగా విలేకర్లతో ముచ్చటించి బ్రో సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో కమర్షియల్ ఎలిమెంట్స్ ఎక్కువ ఉంటాయి. మాతృకతో పోలిస్తే బ్రోలో కథానాయిక పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు వివిధ హంగులు జోడించి, మాతృక కంటే మరింత అందంగా మలిచారు. ఈ సినిమా ఒప్పుకోవడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్ గారు. ఆయన పేరు వింటే చాలు.. సినిమా ఒప్పుకోవడానికి పెద్దగా కారణాలు అక్కర్లేదు. పవన్ కళ్యాణ్ గారి కాంబినేషన్ లో నాకు సన్నివేశాలు లేవు. కానీ ఆయనతో కలిసి సినిమాలో నటించడం సంతోషంగా ఉంది. పవన్ కళ్యాణ్ గారిని అంతకముందు ఎప్పుడూ కలవలేదు. మొదటిసారి ఈ సినిమా ద్వారానే ఆయనను కలిసే అవకాశం లభించింది. ఇదొక సందేశాత్మక చిత్రం. ఈ తరహా సినిమాలో నటించే అవకాశం రావడం నాకు ఇదే మొదటిసారి. నా గత చిత్రాలతో పోలిస్తే ఇది విభిన్న చిత్రం. నటిగా మరింత మెరుగుపడటానికి సహాయపడింది. పవన్ కళ్యాణ్ గారితో నేరుగా వెళ్లి మాట్లాడాలంటే కాస్త భయమేసింది. సాయి ధరమ్ తేజ్ గారికి చెప్తే నన్ను తీసుకెళ్లి ఆయనకు పరిచయం చేశారు. కాంబినేషన్ సీన్స్ లేకపోవడం వల్ల పవన్ కళ్యాణ్ గారిని ఎక్కువ కలవలేకపోయాను. కానీ ఆరోజు ఆయనతో మాట్లాడిన ఆ ఐదు నిమిషాలు మాత్రం మంచి అనుభూతిని ఇచ్చింది.

# హిడింబ రివర్స్ ట్రైలర్ విడుదల




యంగ్, ప్రామిసింగ్ హీరో అశ్విన్ బాబు హైవోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ హిడింబ థియేట్రికల్ రిలీజ్ కి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. అనీల్ కన్నెగంటి దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో శ్రీ విఘ్నేష్ కార్తీక్ సినిమాస్ (SVK సినిమాస్), ఓఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై గంగపట్నం శ్రీధర్ నిర్మించిన హిడింబ ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. హిడింబ థియేట్రికల్ ట్రైలర్ ఇంట్రస్టింగ్ సెటప్, గ్రాండ్ మేకింగ్, అత్యున్నత సాంకేతికత ప్రమాణాతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ రోజు మేకర్స్ రివర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ప్రతి సీక్వెన్స్‌ను రివర్స్ ఆర్డర్‌లో ప్రజంట్ చేసిన ఈ ట్రైలర్ మైండ్ బ్లోయింగ్ గా వుంది. టాలీవుడ్‌లో రివర్స్ ట్రైలర్ విడుదల చేయడం ఇదే తొలిసారి.రివర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో దర్శకుడు అనీల్ కన్నెగంటి మాట్లాడుతూ.. థియేటర్ కి వెళ్లి సినిమా చూడాలంటే జనం ఏం కోరుకుంటున్నారని అంశంపై కొంచెం రిసెర్చ్ తర్వాత రాసుకున్న కథ హిడింబ. థియేటర్ లో చూస్తేనే కిక్ వుంటుంది. 'హిడింబ 'తో కొత్త ప్రపంచంలోకి వెళ్తారు. నిర్మాత శ్రీధర్ గా ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. జూలై 20 సినిమా విడుదలౌతుంది. ప్రేక్షకులు థియేటర్ లో చూసి మా టీంని బ్లెస్ చేస్తారని కోరుకుంటున్నాను. నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ.. హిడింబ ట్రైలర్ టీజర్ పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. హీరో అశ్విన్ , నందిత శ్వేతా, దర్శకుడు అనిల్, టీం అందరూ చాలా హార్డ్ వర్క్ చేశారు. జూలై 20న సినిమా విడుదలౌతుంది. అందరూ థియేటర్ లో చూసి మమ్మల్ని సపోర్ట్ చేయాలి' అని కోరారు. ఈ ఈవెంట్ లో శ్రీనివాస్ రెడ్డి, రఘు కుంచె మిగతా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్క్ ఆంటోని' నుంచి 'అదరద గుండె' సాంగ్

నేటితరం హీరోలు సిల్వర్ స్క్రీన్ పై సందడి చేస్తూనే తెర వెనుక కూడా సత్తా చాటుతున్నారు. అదేబాటలో వెళుతున్న హీరో విశాల్.. తాజాగా తన గొంతును సవరించుకొని తొలిసారి తెలుగులో ఓ సాంగ్ పాడారు. ఆయన చేస్తున్న 'మార్క్ ఆంటోని' మూవీ కోసం పాట పాడి హుషారెత్తించారు విశాల్. ఇటీవల విడుదల చేసిన ఈ సాంగ్ ప్రోమో జనం మెప్పుపొందింది. తాజాగా ఈ సాంగ్ ఫుల్ లిరికల్ వీడియో రిలీజ్ చేశారు మేకర్స్. 'అదరద గుండె అదరద మావా.. బెదరగ బెంగ మొదలవదా మావ.." అంటూ సాగిపోతున్న ఈ పాటను విశాల్ ఫుల్ ఎనర్జీతో పాడారు. ఆయన ఎనర్జీకి తోడు సాంగ్ లో కనిపిస్తున్న విజువల్స్, ఫాస్ట్ బీట్ మ్యూజిక్ పాటకు ప్రాణం పోశాయి. మాస్ ఆడియన్స్ కి కిక్కిచ్చేలా యమ హుషారుగా పాట పాడుతూనే అంతకుమించిన ఎనర్జీతో ఈ పాటలో మాస్ లుక్ లో కనిపించారు హీరో విశాల్. దీంతో విడుదల చేసిన కాసేపట్లోనే ఈ సాంగ్ వైరల్ గా మారింది. ఈ చిత్రాన్ని వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 15న విడుదల చేయబోతున్నట్లుగా ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా సాగుతున్నాయి.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.